



# విజయభాను






విశాఖపట్నం, శుక్రవారం 15-11-2019 | VIJAYABHANU DAILY * VISAKHAPATNAM | సంపుటి : 43 సంచిక : 58 పేజీలు : 8 వెల : 1 రూపాయి

### దేశ వ్యాప్తంగా 50 కేంద్రాలలో

## గీతం ప్రవేశ పరీక్ష

### ఏప్రియల్ 11 నుంచి 21 వరకు పరీక్షలు



సాగర్‌నగర్ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ (బి.టెక్, ఎమ్.టెక్), ఫార్మశీ (బి.ఫార్మశీ, ఎమ్.ఫార్మశీ), ఎమ్.ఆర్క్ కోర్సులలో ప్రవేశానికి గాను నవంబరులో ప్రవేశ ప్రకటన జారీ చేయనుందని వైస్-చాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ వెల్లడించారు.

గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన అఖిలభారత స్థాయి గీతం అడ్మిషన్ టెస్ట్ (గ్యాట్)-2020 వివరాలను తెలియజేశారు.

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విశాఖపట్నం, హైదరాబాద్ లతో పాటు బెంగళూరు క్యాంపస్‌లో నిర్వహిస్తున్న ఇంజనీరింగ్‌లో 21 బి.టెక్ కోర్సులకు, 13ఎమ్.టెక్ కోర్సులకు, బి.ఫార్మశి, ఎమ్.ఫార్మశి కోర్సులకు, రెండేళ్ల ఎమ్.ఆర్క్ కోర్సుకు గ్యాట్-2020 ప్రవేశ పరీక్షను అఖిల భారత స్థాయిలో దేశంలోని 50 పట్టణాలలో ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తోందని తెలిపారు.

**ఇంజనీరింగ్ కోర్సులలో మార్పులు:**

కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్), మెషిన్ లెర్నింగ్ లకు పెరుగుతున్న ప్రాధాన్యత దృష్ట్యా కొత్త విద్యా సంవత్సరం నుంచి ఇంజనీరింగ్ కోర్సులలో మార్పులు చేస్తున్నట్లు వైస్ ఛాన్సలర్ తెలిపారు.

సివిల్, మెకానికల్, ఇసిఇ, సిఎస్ఇ బ్రాంచిలతో పాటు బయోటెక్నాలజీలో సహితం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ సబ్జెక్ట్‌లను జతచేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అలాగే ఇఇఇ కోర్సులో రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్ సబ్జెక్ట్‌ను ఇసిఇ లో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సబ్జెక్ట్‌ను, మెకానికల్‌లో స్మార్ట్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్, ఎలక్ట్రికల్ అండ్ హైబ్రిడ్ వెహికిల్స్ సబ్జెక్టులను, సిఎస్ఇలో సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్సెస్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సబ్జెక్ట్‌లను ప్రారంభిస్తున్నట్లు ఆయన వివరించారు. వీటివల్ల విద్యార్థులకు ఉపాది అవకాశాలు

తరువాయి 6లో..

### నేటి బాలలే రేపటి

# నవ సమాజ నిర్మాతలు

- ప్రభుత్వ పాఠశాలలు చదువుల దేవాలయాలుగా మారుస్తా
- విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు ఖర్చులకు రూ. 20 వేలు
- రాజకీయ, సినీ ప్రముఖుల పిల్లలు తెలుగు మీడియంలో చదవడం లేదు
- కేవలం రాజకీయం కోసం ఆరోపణలు చేస్తున్నారు
- 'మనబడి నాడు-నేడు' ప్రారంభోత్సవంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



ఒంగోలు: 'మన బడి నాడు-నేడు'కార్యక్రమంతో చరిత్రను మార్చబోయే తొలి అడుగులు వేస్తున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలను చదువుల దేవాలయాలుగా మారుస్తామని హామీ ఇచ్చారు. నేటి బాలలే రేపటి మన సమాజ నిర్మాతలని ఈ సందర్భంగా గుర్తుచేశారు. గురువారం ఒంగోలులోని పీవీఆర్ బాలుర పాఠశాలలో 'నాడు-నేడు'కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో? ప్రజలు, విద్యార్థులనుద్దేశించి సీఎం వైఎస్ జగన్ ప్రసంగించారు. రాబోయే పదేళ్లలో ప్రపంచం ఎలా ఉండబోతుందో ఊహించాలని, ఇప్పటికే స్మార్ట్ ఫోన్లు, ఇంటర్‌నెట్ అందుబాటులోకి వచ్చాయని, పదేళ్ల తర్వాత రోబోటిక్స్ కీలకం కానున్నాయని అన్నారు. మన పిల్లలకు ఇంగ్లీషు చదువులు లేకపోతే వాళ్ల భవిష్యత్ ఎలా ఉంటుందో ఆలోచించండని కోరారు. ప్రపంచంతో పోటీ పడేలా పిల్లలను తీర్చిదిద్దాల్సిన అవసరం, బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఒక మంచి నిర్ణయం సరైన సమయంలో తీసుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెడుతున్నట్లు

తరువాయి 2లో..

### కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



విశాఖపట్నం : కార్పోరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోనివిదంగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గురువారం ఉదయం చిన గదిలి మండలం, తోటగరువులో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన బాలల దినోత్సవం మరియు మనబడి నాడు - నేడు కార్య క్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బాలలు ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి చేరేందుకు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న పాఠశాలలు రాబోయే రెండు సంవత్సరాలలో ఎలా ఉండాలనే దానిపై ప్రభుత్వం దృష్టి సారిస్తున్నదని తెలిపారు. మన బడి నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో 9 ప్రధాన్యత అంశాలతో సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. నిరంతర నీటి సరఫరాతో మరుగుదొడ్లు నిర్వహణ, లైట్లు, ఫ్యానులతో విద్యుదీకరణ, రక్షిత మంచినీటి సరఫరా తదితర నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జి.వి.ఎం .సి మున్సిపల్ కమిషనర్ డా. జి.సృజన, డి ఇ ఓ లింగేశ్వర రెడ్డి, వివిధ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇసుకను దోచేస్తున్నారు

- భవన నిర్మాణ కార్మికుల ఆత్మహత్యలు కనబడవా?
- ఇంటి దొంగలను జగన్ పట్టుకోరా!?
- మంత్రుల బాధ్యతారాహిత్యం దుర్మార్గం
- టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు



విజయవాడ : ఒక్క ఛాన్స్.. ఒక్క ఛాన్స్ అంటూ ఎన్నికల్లో జగన్ ప్రజల్ని అడిగారని.. అవకాశం ఇస్తే ఇప్పుడు మరణశాసనం రాస్తున్నారని మండిపడ్డారు టీడీపీ అధినేత చంద్రబాబు. ఏపీలో మాత్రమే ఇసుకను కబ్జా చేశారని.. ఇసుక మాఫియాను తయారు చేసి రాష్ట్రం మీదకు వదిలారని మండిపడ్డారు. ఏపీ ఇసుక తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, ఒడిశాలో దొరుకుతోందన్నారు. కృత్రిమ ఇసుక కొరత సృష్టించారని.. వైసీపీ నేతలు, కార్యకర్తలే ఇసుకను దోచేస్తున్నారని మండిపడ్డారు. ఇసుకను దోచేస్తున్న ఇంటి దొంగలు జగన్‌కు కనపడరా అంటూ ప్రశ్నించారు. విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్ దగ్గర వేదికపై దీక్ష చేపట్టారు. టీడీపీ అధినేత దీక్ష ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 12 గంటల పాటూ దీక్ష కొనసాగనుంది. ఈ దీక్షలో మాట్లాడిన చంద్రబాబు.. జగన్ సర్కార్ విరుచుకుపడ్డారు. భవన నిర్మాణ కార్మికుల ప్రాణాలు పోతున్నా ప్రభుత్వం పట్టించు కోకపోవడం దారుణమన్నారు చంద్రబాబు.

మంత్రులు బాధ్యతారాహిత్యంగా మాటాడటం దుర్మార్గమ న్నారు. తమ కుటుంబ సభ్యులు ఆత్మహత్య చేసుకుంటే.. కాలం చెల్లి చనిపోయారని మంత్రులు అనగలరా అంటూ ప్రశ్నించారు. ఇసుక కొరతతో పనులు లేక భవన నిర్మాణ కార్మికులు రోడ్డుపడ్డరాని.. సెల్ఫీ వీడియోలు తీసుకుని ఆత్మహత్య చేసుకునే దౌర్భాగ్య పరిస్థితి

తరువాయి 2లో..

### ఏపీ సీఎస్‌గా నీలం సాహ్నీ



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీగా సీనియర్ ఐఏఎస్ నీలం సాహ్నీ బాధ్యతలు స్వీకరించారు. గురువారం ఉదయం సెక్ర టేరియెట్‌లో ఇంఛార్జ్ సీఎస్ నీరబ్‌కుమార్ నుంచి బాధ్యతలు అందు కున్నారు. చాలా కాలం తర్వాత తిరిగి ఏపీకి రావడం ఆనందంగా ఉందన్నారు సాహ్నీ. తన తొలి పోస్టింగ్ మచిలీపట్నంలోనేనని.. మళ్లీ ఇపుడు అదే రాష్ట్రానికి సీఎస్‌గా రావడం

తరువాయి 2లో..






# ప్రపంచీకరణలో ఆంగ్లం అవసరం

### జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి కొడాలి



శ్రీకాకుళం: ప్రపంచీకరణలో ఆంగ్లం అవసరమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి మరియు జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వర రావు (నాని) అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాడు-నేడు కార్యక్రమాన్ని బాలల దినోత్సవం సందర్భంగా రాజాం మండలం పొగిరి జడ్పీ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర రహదారులు, భవనాల శాఖా మంత్రి ధర్మాన క్రిష్ణ దాస్ తో కలసి ఇన్ ఛార్జ్ మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా ఏపి సాంఘిక సంక్షేమ గురుకులం ఆధ్వర్యంలో ఐఐటి, జెఇఇ, నీట్ పరీక్షలకు సూపర్ 60 బ్యాచ్ శిక్షణను మంత్రి ప్రారంభించారు. జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి కొడాలి వెంకటేశ్వరరావు (నాని) మాట్లాడుతూ స్వాతంత్ర్య వచ్చి 70 ఏళ్ళు అయినా పాఠశాలలకు మౌళిక సదుపాయాల కొరత ఉందన్నారు. రాష్ట్రంలో 45 వేల పాఠశాలలకు మౌళిక సదుపాయాలు కల్పనకు రూ.33 వేల కోట్లు కేటాయింపు

తరువాయి 2లో..

# మధుమేహ వ్యాధి పై జిమ్‌సర్ వాక్‌థాన్




సాగర్‌నగర్ : ప్రపంచ మధుమేహ దినం సంధ్బంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) వైద్య కళాశాల జాతీయ సేవా పధకం విద్యార్థుల ఆద్యవర్యంలో గురువారం స్థానిక బీచ్ రోడ్డులో వాక్‌థాన్ నిర్వహించారు. కాళీమాతా ఆలయం నుంచి వైఎమ్‌సిఎ వరకు జరిగిన ఈ వాక్‌థాన్‌ను జిమ్‌సర్ ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతి పద్మజ, ఆస్పత్రి సూపరెండెంట్ డాక్టర్ పి.శ్యామ్‌ప్రసాద్ హజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇన్సులిన్ కనుగొన్న శాస్త్రవేత్త డాక్టర్ బెంటిన్ జన్మదిన సందర్భంగా ఏటా ప్రపంచ మధుమేహ దినంగా నిర్వహిస్తున్నారని తెలిపారు.

శారీరక వ్యాయామం లేకపోవడం, ఆహరపు అలవాట్లు, వత్తిడిలు వల్ల కొత్తతరం యువత మధుమేహం బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులు మధుమేహంపై అవగాహన కలిగించే కర పత్రాలను పంపిణీ చేశారు. బీచ్ వాకర్లుకు రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.రమణరావు, కో-ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎండాడ, వాడపల్లి గ్రామాలలో చైతన్య ర్యాలీ నిర్వహిచారు.



విశాఖ పూర్ణా మార్కెట్ దగ్గర గల శ్రీ నీలమాంబ అమ్మవారి ఆలయం దగ్గర కార్తీకమాసం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు మరియు ఆదివారం 17వతేదీన అమ్మవారి ఆలయం దగ్గర కుబీర హోమం జరుగుతుందని ఆలయ కమిటీ మరియు ప్రధాన అర్చకులు శివశర్మ తెలియజేశారు. ఆసక్తి గల వారు ఆలయం కమిటీ ద్వారా గానీ ఆలయ పురోహితుల ద్వారా గానీ తమ పేర్లను నమోదు చేయించుకోవాల్సిందిగా కోరారు. పూర్తి వివరాలకు ఈ ఫోన్ నెంబర్‌ను 8886551444 సంప్రదించగలరు.

## ఘనంగా చిల్డ్రన్స్ డే

యానాం : స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో నిర్వహించిన చిల్డ్రన్స్‌డేను ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రాంతీయ పరిపాలన అధికారి శివరాజ్ మీనా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.





టోకూరు పంచాయితీ ములియగూడ జంక్షన్‌లో

## తెలుగు దేశం పార్టీ సర్వసభ్య సమావేశం



అనంతగిరి : అనంతగిరి మండలం టొకూరు పంచాయతీ ములియ గుడ జంక్షన్లో తెలుగు దేశం పార్టీ సర్వసభ్య సమావేశం గురువారం వైస్ ప్రెసిడెంటు సమర్థి దొన్ను అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిలు జెడ్పీ వైస్ చైర్మన్ కొట్యాడ అప్పా రావు, యస్టీ సెల్ వైస్ ప్రెసిడెంటు జన్ని అప్పా రావు, ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కొట్యాడ అప్పారావు మాట్లాడుతూ మాజీ ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు చేపడుతున్న ఇసుక కొరత దీక్షకు మద్దతుగా సంఘీభావం తెలుపుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు రాబోయే స్టానిక ఎన్నికలకు పార్టీ బలోపేతం గూర్చి చెప్పడం జరిగిందని అలాగే వైయస్సార్ ప్రభుత్వం చేపడుతున్న అవినీతి పథకాలు గూర్చి విడమరచి ప్రజలకు తెలపాలని కార్యకర్తలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, మాజీ సర్పంచ్ సారా సోము, సోమన పాల్గొన్నా రని విజయభాను ప్రతినిధికి తెలిపారు,



స్థానిక ఉత్తర నియోజకవర్గంలోని 11వ వార్డు సీతమ్మధార పి అండ్ టి కాలనీలోని ఎన్ఎంసి (జివిఎంసి) హైస్కూల్లో మన బడి, నాడు-నేడు కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం విద్యార్థులు మధ్యాహ్న భోజనంగా తినే ఆహార పదార్థాలను పరిశీలిస్తూ, రుచి చూస్తున్న ఉత్తర నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త కేకే రాజు.

## ఘనంగా భారత ప్రథమ ప్రధాని పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ 130వ జయంతి వేడుకలు

విశాఖపట్నం : ఆర్.కె.బీచ్ రోడ్డులో గల జవహర్ లాల్ నెహ్రూ విగ్రహం వద్ద భారతదేశ ప్రథమ ప్రధాని, పండిత్ జవహర్ లాల్ నెహ్రూ (14-11-1889, 27-05-1964) 130వ జయంతి కార్యక్రమం ఇసఫ్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో చురుకైన పాత్ర వహించి మహాత్మాగాంధీ అనుంగు శిష్యునిగా వ్యవహరిస్తూ, దేశ స్వాతంత్ర్యా నంతరం భారతదేశ ప్రథమ ప్రధానిగా నెహ్రూ నియమితులయ్యారు. అస్తవ్యస్థంగా ఉన్న దేశ ఆర్థిక పరిస్థితి, చక్కదిద్దేందుకు మన ప్రధానమంత్రి జవ హర్‌లాల్ నెహ్రూ తీవ్రంగా కృషి చేశారు. ప్రపంచంలో పలు దేశాల ఆర్థిక విధానాలను పరిశీలించి అటు పెట్టుబడిదారి విధానం కాకుండా, ఇటు సామ్యవాద విధానం కాకుండా మిశ్రమ ఆర్థిక విధానాన్ని అవలంభించారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధి కోసం జవహర్‌లాల్ నెహ్రూ అనేక పరి శ్రమలు, ఔషధ పరిశ్రమలను నెల కొల్పారు. ప్రజలు మూఢ విశ్వాసాలనుండి బయటపడాలని ఆధునిక విద్యను ప్రజలకు అందాలని విద్యాల యాలను అభివృద్ధి చేశారు. దేశ సరిహద్దు పరిరక్షణ అవసరాన్ని గుర్తించి రక్షణ రంగ, సైనికా భివృద్ధికి సోవియట్ యూనిన్ సహకారిన్న కూడా పొందారు. అలీనో ద్యమాలతో కలిసి భారత దేశం శాంతికా ముకదేశం అని ప్రపంచానికి చాటారు. జవహర్‌లాల్ నెహ్రూ ఒక గొప్ప మానవతా వాది, అభ్యుదయవాది. స్వాతంత్ర్య పోరాట సమయంలో జైలులో ఉన్నప్పుడు తన కుమార్తె ఇందిర ప్రియ దర్శిని అనేక ఉత్తమ లేఖలను రాశారు. అవి ఒక పుస్తకరూపంగా దాల్చి గ్లిమ్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీగా రూపొందించారు. అలాగే డిస్కవరీ ఆఫ్ ఇండియా, యాన్ ఆటో బయోగ్రఫీ వంటి గొప్ప పుస్తకాలు రాశారు. భారతదేశా భివృద్ధి కోసం ప్రథమ ప్రధాని తన చివరి శ్వాసవరకు కృషి చేసి 1964- మే-27వ తేదీన చివరి శ్వాస విడిచారు. దేశం కోసం ఎంతో శ్రమించిన జవహర్‌లాల్ నెహ్రూ చిరస్మర ణీయులని వక్తలు కొని యాడారు. ఈ కార్య క్రమంలో ముఖ్య వక్తలు టి.ఎస్.సు కుమార్, జె.వి.ప్రభాకర్, ప్రావ మంజులత, (ఆంధ్ర యూని వర్సిటీ), ఎన్.బి.మూర్తి, అనంతరావు, (అరసం), రాంప్రభు (సమాజ చైతన్య వేదిక).




## ప్రపంచీకరణలో ఆంగ్లం అవసరం

జరిగిందన్నారు. ఇందులో మొదటి దశ కార్యక్రమంలో 15,715 పాఠశాలల్లో ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు, మరుగుదొడ్లు, ఫర్నీచర్, ప్రహారీ గోడలు, తరగతి గదులకు పెయింటింగులు, మరమ్మతులు, ఫినిషింగులు, బ్లాక్ బోర్డుల ఏర్పాటు, రక్షిత తాగు నీరు, ఇంగ్లీషు లాబ్ ల సదుపాయం కల్పించడం జరుగుతుందని చెప్పారు. పునాది స్థాయి నుండి ప్రామాణిక విద్య అందించాలని ముఖ్యమంత్రి ప్రజా సంకల్ప యాత్రలోనే నిర్ణయించారని చెప్పారు. పాఠశాలల్లో బోధనా ప్రమాణాలు పెంచడంతోపాటు ఉపాధ్యాయులకు అవసరమైన శిక్షణ అందించడం జరుగుతుందని చెప్పారు. సకాలంలో విద్యార్థులకు పుస్తకాలు, బూట్లు, యూనిఫారాలు అందించడం., మధ్యాహ్న భోజనం నాణ్యత పెంచడం, విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించడం వంటి అంశాలరపై ప్రత్యేక శ్రద్ధ వహించడం జరుగుతోందని చెప్పారు.

వై.యస్.ఆర్ ఫీజ్ రీయింబర్స్మెంట్ తో పేదల చదువులకు శ్రీకారం చుట్టగా, అతని తనయుడు జగన్ మోహన్ రెడ్డి మరిన్ని సౌకర్యాలు కల్పించాలని నిర్ణయించారని వివరించారు. బడుగు బలహీన, పేద వర్గాలను ఇంగ్లీషు మీడియంలో చదివించడానికి ముఖ్య మంత్రి సంకల్పించారని పేర్కొన్నారు. ఉన్నత స్థాయిలో ఉన్న కుటుంబాలు ఎక్కువగా ఇంగ్లీషు మీడియం లో చదివిస్తున్నారని ఈ సందర్భంగా మంత్రి అన్నారు. ప్రపంచీకరణ (గ్లోబలైజేషన్) లో ఇంగ్లీషు అవసరం ఉందని అన్నారు. ప్రామాణికమైన చదువులకు ఇంగ్లీషు ఆవశ్యకతను ఎవరూ కాదనలేరని అన్నారు.

మొదటి పేజీ తరువాయి

## నేటి బాలలే రేపటి నవ సమాజ నిర్మాతలు

తెలిపారు. సీఎం వైఎస్ జగన్ పూర్తి ప్రసంగం ఆయన మాటల్లోనే..

**భావితరాల ముందు సిగ్గుతో తలదించుకోవాలి..**

'ప్రపంచంతో పోటీ పడేలా పిల్లలను తీర్చిదిద్దాల్సి ఉంది. ప్రభుత్వాలు వాళ్లకు అండగా నిలబడాల్సిన అవసరం ఉంది. ఒక మంచి నిర్ణయం సరైన సమయంలో తీసుకోవాలి. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలను చదువుల దేవాలయాలుగా మారుస్తాం. రాజకీయ నేతలు, జర్నలిస్టులు, సినీ నటులు ఎవరు కూడా వాళ్ల పిల్లలను తెలుగు మీడియంలో చదివించడం లేదు. సంస్క ృతి పేరుతో పిల్లల భవిష్యత్‌ను పట్టించుకోకపోతే భావితరాల ముందు సిగ్గుతో తలదించుకోవాల్సి వస్తుంది. రాబోయే రోజుల్లో తెలుగు ప్రజలు ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నాం.

*దానికి చదువు ఒక్కటే ఏకైక మార్గం*

పిల్లలకోసం విప్లవాత్మక నిర్ణయం తీసుకుంటే.. రాజకీయం కోసం ఆరోపణలు చేస్తున్నారు. ఆరోపణలు చేసేవారు హిపోక్రసీని వదిలి డెమొక్రసీకి విలువ ఇవ్వాలి. కేవలం కొందరు బాగుపడితే సమాజం బాగుపడదు. అందరూ బాగుపడితేనే రాష్ట్రం బాగుపడుతుంది. పేదరికం నుంచి బయటపడాలంటే చదువు ఒక్కటే ఏకైక మార్గం. చరిత్రను మార్చే తొలి అడుగులు ఇవాళ వేస్తున్నాం. పాదయాత్రలో నేను చూశాను.. నేను విన్నాను.. నేను ఉన్నానని చెబుతూ అడుగులు వేస్తున్నాం. నాడు-నేడుతో ప్రతీ పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదిలో ట్యూబ్‌లైట్లు, ఫర్నీచర్, స్కూల్‌కు కాంపౌండ్ వాల్, ల్యాబ్స్ వంటి సకల సౌకర్యాలను కల్పిస్తాం. అదేవిధంగా ప్రతీ స్కూల్లో 1 నుంచి ఆరో తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెడుతున్నాం. తెలుగు తప్పనిసరి సబ్జెక్ట్‌గా ఉంటుంది. ప్రతీ స్కూళ్లో పేరెంట్స్ కమిటీలను ఏర్పాటు చేశాం.

**సమస్యలు వస్తాయని తెలుసు..**

అయితే ఒకటి నుంచి ఆరో తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెడితే కొన్ని సమస్యలు వస్తాయన్న విషయం తెలుసు. వాటిని అధిగమించేందుకు బ్రిడ్జ్ కోర్సులు ఏర్పాటు చేస్తాం. టీచర్లకు శిక్షణ ఇస్తాం. ఒకట్రెండు సంవత్సరాలు కష్టపడ్డా.. ఆ తర్వాత పిల్లలు ఇంగ్లీష్ మీడియంలో ముందుకెళ్లారు. ప్రతీ ఏడాది స్కూళ్ల కోసం రూ.3500 కోట్లు ఖర్చు చేస్తాం. వచ్చే కాలంలో రాష్ట్రంలోని 45 వేల స్కూళ్ల రూపురేఖలను మారుస్తాం. తొలి విడతలో భాగంగా దాదాపు 15,700 పాఠశాలల్లో నాడు-నేడు ప్రారంభిస్తాం. జూన్, 2020 నాటికి పాఠశాలల్లో అన్ని వసతులు తీసుకొస్తాం. జనవరి 9న అమ్మ ఒడి పథకం కింద రూ. 15 వేలు ఇస్తాం. అదేవిధంగా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కూడా తీసుకొస్తున్నాం. హాస్టల్లో ఉన్న విద్యార్థులకు ఖర్చుల కోసం ఏడాదికి రూ. 20 వేలు ఇస్తాం.

**బాట కష్టమైనదే.. శత్రువులు ఎక్కువయ్యారు**

ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాం. పరిశ్రమల్లో స్థానికులకే 75 శాతం ఉద్యోగాలు ఇచ్చేలా చట్టం తీసుకొచ్చాం.పేదవాడికి మేలు చేసేందుకు అడుగులు ముందుకు వేస్తున్నాం. దేశంలో జీడీపీ దెబ్బతింటుందని అందరూ చెబుతున్నారు. రాష్ట్రంలో 4 లక్షల ఉద్యోగాలు ఇవ్వగలిగామని గర్వంగా చెబుతున్నాను. ప్రతి ఊరిలో పది మందికి ఉద్యోగాలు ఇచ్చామని గర్వంగా చెబుతున్నాను. ప్రతి కార్యక్రమంలోను సవాళ్లు ఉన్నాయి. అయినా అడుగులు ముందుకు వేస్తున్నాను. బాట కష్టమైనదే. శత్రువులు కూడా ఎక్కువగా ఉన్నారు'అని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఏపీ సీఎస్‌గా నీలం సాహ్ని

అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. విభజన తర్వాత ఏపీ తొలి మహిళా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నీలం సాహ్ని నియమితులయ్యారు. సాహ్ని ఇప్పటివరకూ కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత శాఖ కార్యదర్శిగా వ్యవహరించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీగా నీలం సాహ్నిని నియమిస్తూ.. జగన్ సర్కారు బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల సమయంలో సీఎస్‌గా బాధ్యతలు చేపట్టిన ఎల్వీ సుబ్రహ్మణ్యంను ఇటీవలే బదిలీ చేసిన ఏపీ సర్కారు.. ఆయన స్థానంలో నీరబ్ కుమార్ ప్రసాద్‌కు తాత్కాలిక బాధ్యతలు అప్పగించింది. ఇప్పుడు పూర్తిస్థాయిలో కొత్త సీఈవోగా నీలం సాహ్నిని నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. సీఎంవో స్పెషల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ పేరిట ఆదేశాలు జారీ అయ్యాయి.

1984వ ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సాహ్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో.. మచిలీపట్నంలో అసిస్టెంట్ కలెక్టర్‌గా పని చేశారు. టెక్కలి సబ్ కలెక్టర్‌గా, నల్గొండ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పని చేశారు. మున్సిపల్ పరిపాలన విభాగం డిప్యూటీ సెక్రటరీగా, స్త్రీ శిశు సంక్షేమశాఖ పీడీగా పని చేశారు. నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లోనూ పని చేసిన సాహ్ని.. నల్గొండ జిల్లా కలెక్టర్‌గా, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్త కార్యదర్శిగా పని చేశాక.. ఏపీఐడీసీ కార్పొరేషన్ వీసీ అండ్ ఎండీగా ఉమ్మడి రాష్ట్రంలో పని చేశారు. అనంతరం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేశారు. 2018 నుంచి ఇటీవలి వరకు కేంద్ర సామాజిక న్యాయం మరియు సాధికారత కార్యదర్శిగా పనిచేశారు.

## ఇసుకను దోచేస్తున్నారు



పర్మిషన్లు, టోకెన్లు ఇస్తున్నారని మండిపడ్డారు చంద్రబాబు. అసత్యాలు ప్రచారం చేస్తూ.. లూటీ, దోచేసే ఆలోచనలు చేస్తున్నారని.. ఇసుక కొరత పేరుతో సిమెంట్ కంపెనీలతో బేరాలా డుతున్నారని విమర్శిం చారు. ఇసుక ఇవ్వడం చేతకాదని చెప్పి.. రాష్ట్రానికి వైసీపీ క్షమాపణ చెప్పాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు రూ.25లక్షలు.. కార్మికులకు రూ.10వేలు ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రజల కోసం టీడీపీ హయాంలో ఇసుక పాలసీ తీసుకొచ్చామన్నారు చంద్రబాబు. టీడీపీ తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానం వల్ల ఎవ్వరూ నష్టపోలేదని.. ఇప్పుడు సొంత పొలంలో మట్టి ఇంటికి తీసుకుపోవాలన్నా.. ప్రభుత్వ అనుమతి కావాలనటం అహంభావానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఎవరు ఇసుక బకాసురులో చెపాల్సిన బాధ్యత జగన్‌పై ఉందన్నారు. ఇసుక కొరత, భవన నిర్మాణ కార్మికుల కోసం పవన్ కళ్యాణ్ లాంగ్‌మార్చ్ చేశారని.. అలాంటి వ్యక్తిపై వ్యక్తిగత దూషణలకు దిగడం దారుణమన్నారు.

కల్పించారని మండిపడ్డారు. ప్రభుత్వ పెద్దల స్వార్థం కోసమే ఈ సమస్య సృష్టించారని దాదాపు 35లక్షల మంది తిండి లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక కొరతకు వర్షాలు, వరదల కారణాలు చెబుతున్నారు. ఇసుక నిల్వలు వరదల్లో కొట్టుకుపోయాయని ఓ మంత్రి అంటారు. గాయపడిన గుండెల్లో ముళ్లు గుచ్చుతారా.. గాయాలపై కారం జల్లి ఆనందిస్తారా.. ఈ రాష్ట్రాన్ని రాబందుల పాలు చేశారు. రూ.2లక్షల జరిమానా, 2 ఏళ్ల జైలుశిక్ష వేస్తారట.. ఓ పక్క దోచుకునేది మీరే, మరో పక్క జరిమానాలు విధించేది మీరేనా..? వైసిపి నాయకుల్లో ఎంతమందికి జరిమానా వేస్తారు. ఇంటి దొంగలు మీరే, అసలు దొంగలు మీరు..ఆరోపణలు చేసేది వేరేవాళ్లపైనా అంటూ మండిపడ్డారు. రాష్ట్రంలో ఇసుకకు వైసీపీ ఎమ్మెల్యేలు

## దళితుల అభ్యున్నతికి పాటుపడుతున్న మహనీయుడు జగన్‌మోహన్‌రెడ్డి

### విశాఖ పార్లమెంటు జిల్లా యస్‌సి సెల్ అధ్యక్షుడు రెయ్యి వెంకటరమణ

విశాఖ సిటీ : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కుటుంబాలను, పిల్లలను ఉన్నత చదువులు చదవడం, చంద్రబాబుకి, పవన్‌నాయుడుకు, వెంకయ్య నాయుడుకి ఇష్టం లేదు. కాని మన బిడ్డలను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడం కోసం ఆంగ్ల మాద్యమును ప్రవేశపెడితే ఎందుకంత గగ్గోలు పెడుతున్నారు. పవన్ నాయుడు మీ పిల్లలు ఏ పాఠశాలలో చదువుతున్నారో ఇప్పటికీ చెప్పలేని పరిస్థితి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల కోసం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టిన మహ నీయుడు. జగన్ మోహన్‌రెడ్డిని విశాఖ పార్లమెంటు జిల్లా యస్‌సి సెల్ అధ్యక్షుడు రెయ్యి వెంకటరమణ పేర్కొన్నారు.



# ప్రతిభ విద్యాలయంలో బాలల దినోత్సవ వేడుకలు



సబ్బవరంః భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినం రోజే బాలల దినోత్సవ వేడుకలు నవంబర్ 14న జరుకుంటున్నాము. ఈ బాలల దినోత్సవం నాడు ప్రతీ పాఠశాలల్లో ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తున్నారు.అందులో భాగంగా సబ్బవరం స్థానిక ప్రతిభ విద్యాలయంలో వారం రోజులుగా జరుగుతున్న బాలల దినోత్సవ సంబరాలకు ముగింపుగా గురువారం పాఠశాల ఆవరణలో పాఠశాల కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ, ప్రిన్సిపాల్ అన్సీ జోసెఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పలు సాంస్కృతిక జానపద నృత్యాలు, సాంఘిక నాటిక, తదితర పలు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించి పిల్లలను ఆనంద భరితులను చేసారు.అనంతరం క్రీడా పోటీల్లో వ్యాసరచన, క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు కరస్పాండెంట్ రమణ, ప్రిన్సిపాల్ అన్సీజోసెఫ్ చేతుల మీదుగా అందజేసారు. అలాగే రాష్ట్ర జాతీయ స్థాయి క్రీడల్లో ఎంపికైన విద్యార్థులకు జ్ఞాపికలను ఇచ్చి కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ అభినందించారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులకు మిఠాయిలు అందజేసారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

***బాట జంగాలపాలె ప్రాథమిక పాఠశాలలో..***



బాలల దినోత్సవ సందర్భంగా బాట సంఘాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి .నెహ్రూ జయంతి పిల్లల ఆట పాట సాంస్క ృతిక కార్యక్రమాలు పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో జరిగాయి .కమిటీ చైర్మన్ టీ నూకరాజు, శిరీష టీచర్ వైస్ చైర్మన్ కె.రామలక్ష్మి గ్రామ పెద్దలు పడాల వెంకటరమణ ,కాపు శెట్టి వెంకట్ , అప్పారావు మాస్టారు, రామ్సు , గ్రామ వెల్ఫేర్ అసిస్టెంట్ ఎం సందీప్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ బి కుమార్ అంగన్వాడి టీచర్ రమణమ్మ పిల్లల తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అమ్మవారి విగ్రహం ప్రారంభం



గొలుగొండః మండల కేంద్రం గొలుగొండలో కనకదుర్గ అమ్మవారి విగ్రహం గురువారం వేదపండితుల ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం చేశారు. తెల్లవారు అమ్మవారి ఆలయం ప్రారంభోత్సవం కావడంతో గ్రామస్థులంతా అమ్మవారిని దర్శించుకోవడం కోసం బారులు తీరారు. అలాగే ప్రత్యేక హోమం నిర్వహించారు. వచ్చిన భక్తులకు కమిటీ సభ్యులు అన్నసమారాధాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

# భారతీయ భాషలకు ప్రాధాన్యమివ్వాలి

విశాఖ సిటీః పాఠశాలల్లో ప్రాథమిక విద్య ఏభాషలో జరగాలనే దానిపైన ఈ మధ్య పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. కానీ అసలు సమస్యపైన దృష్టిపెట్టి, చర్చించి.. దానిలోని సాధక, బాధకాలను వివరించి ప్రజాభిప్రాయాన్ని కూడగట్టకుండా.. చర్చను పక్కదారి పట్టించే ప్రయత్నం చేయడం దురదృష్టకరం. తెలిసో, తెలియకో.. కొంతమంది ఈ చర్చను పక్కదారి పట్టించడంలో భాగస్వాములవుతున్నారు.

ఈ చర్చలో మొదటగా మనం గుర్తుంచుకోవాల్సింది.. మన తెలుగుభాషకు, తెలుగు ప్రజలకు సరైన గుర్తింపు, న్యాయం, జరగడం లేదన్న ఉద్దేశంతోనే.. భాషా ప్రయుక్త రాష్ట్రం అవసరమని నాడు మహానుభావుడు, కీర్తిశేషులు పొట్టి శ్రీరాములు అమరణ నిరాహార దీక్ష చేయడం.. తదనంతర పరిస్థితుల్లో తెలుగువారిని, తెలుగు భాషను ఏకతాటిపైకి తెస్తూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ జరిగిన విషయాన్ని మనమంతా గుర్తుంచుకోవాలి.

ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు లేదా మిషనరీలు, మదర్సాల వంటి సంస్థలు ఏ మాధ్యమంలో బోధించాలి అనే విషయాన్ని మనం నిర్దేశించడం లేదు. కానీ.. భాషా ప్రయుక్త రాష్ట్రమైన తెలుగు రాష్ట్రంలో తెలుగు మాధ్యమాన్ని ప్రజలకు అందించాల్సిన పవిత్ర కర్తవ్యం ప్రభుత్వానిదే. ఇందులో ఎవరికీ సందేహం అక్కర్లేదు. ప్రభుత్వం ఒక ప్రైవేటు సంస్థ కాదనే విషయాన్ని కూడా ఇక్కడ అందరూ గుర్తుపెట్టుకోవాలి.

మెకాలే, నిజాం వంటి వారు పరాయిభాషను (వారి భాష) మనపై రుద్దేందుకు చేసిన ప్రయత్నాలను ఆరోజు ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. భారత్ పై సాంస్కృతిక, భాషాపరమైన దాడులు ఎన్ని జరిగినా.. అంతలా పోరాడాము కనుకే మన భారతీయ భాషలు ఇంకా మనుగడ కలిగి ఉన్నాయి.

ప్రజలచేత ఎన్నుకోబడిన మన నేటి రాష్ట్ర ప్రభుత్వానికి.. ప్రజాసంక్షేమమే అభిమతం కావాలి. మన మాతృభాష అయిన తెలుగుకు సరైన గౌరవం కల్పించడం కూడా ప్రభుత్వ బాధ్యతే. కానీ.. ఆ ప్రభుత్వమే 'నేను ఒకటో తరగతి నుంచే తెలుగు మాధ్యమాన్ని ఎత్తేస్తాను' అని ప్రకటిస్తే అందులో అర్థమేముంటుంది.

# ఏయూలో సైన్స్ పార్క్‌ను నెలకొల్పాలి

- చిన్నారులకు ప్రత్యేక గ్రంథాలయం, రీడింగ్ రూమ్ నిర్మాణం
- నగరవాసులకు అందుబాటులో ఏయూ గ్రంథాలయం ఉండాలి
- గ్రంథాలయం పనివేళలు పెంచుతూ విద్యార్థులకు అందుబాటులో ఉంచాలి
- వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి



ఆంధ్రవిశ్వకళాపరిషత్ః ఆంధ్రవిశ్వ విద్యాలయంలో శాస్త్రీయ పరిశోధనలు, ఆవిష్కరణలు జరిపే దిశగా సైన్స్ పార్క్‌ను నెలకొల్పాల్సిన అవసరం ఉందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం ఏయూ డాక్టర్ వి.ఎస్ క్రిష్ణ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని చిన్నారులకు ఉపయుక్తంగా గ్రంథాలయం, రీడింగ్ రూమ్‌ను దాతల సహకారంతో నిర్మిస్తామన్నారు. డాక్టర్ వి.ఎస్. క్రిష్ణ గ్రంథాలయాన్ని నగరవాసులకు ఉపయుక్తంగా నిలపాలని సూచించారు. విద్యార్థులకు ఉపయుక్తంగా గ్రంథాలయం వేళలను పెంచే విధంగా ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.

యువత అవసరాలు తెలుసుకుని వాటికి అనుగుణంగా అవసరమైన మార్పులను చేపట్టాలని సూచించారు. డిజిటల్ అనుసంధానం చేయడం ఎంతో అవసరమన్నారు. త్వరలో ఏయూలో ఒక రీడింగ్ రూమ్‌ను నిర్మించి ఇవ్వడానికి లవ్ అండ్ కేర్ నిర్వాహకులు డాక్టర్ ఏసుపాదం ముందుకు వచ్చారన్నారు. త్వరలో దీని నిర్మాణం ప్రారంభిస్తామన్నారు. ఉద్యోగులు ఆత్మగౌరవంతో పనిచేయాలని, విద్యార్థుల ఆనందమే లక్ష్యంగా సేవలు అందిచాలని సూచించారు.

పేదలకు ఆంగ్ల మాధ్యమంలో విద్యను అందించడానికి ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన రెడ్డి ఎంతో ఉన్నతమైన నిర్ణయం తీసుకున్నారన్నారు. దీనిని కొందరు విమర్శించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందన్నారు. పేదలకు నాణ్యమైన ఆంగ్ల మాధ్యమంలో విద్యను ఎందించడం తప్పుగా చూపుతున్నారన్నారు. ఇటువంటి మంచి నిర్ణయాలను అందరూ స్వాగతించాలన్నారు.

గ్రంథాలయాధికారి ఆచార్య కె.విశ్వేస్వర రావు మాట్లాడుతూ 1968 నుంచి గ్రంథాలయ వారోత్సవాలను దేశవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతోందన్నారు. గ్రంథాలయ ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రంథాలయ ఉద్యమానికి నాంది మన రాష్ట్రం నుంచి జరగడం ఎంతో ఆనందదాయకమన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ప్రత్యేక పుస్తక ప్రదర్శనను వీసీ ప్రసాదరెడ్డి ప్రారంభించి తిలకించారు.

కార్యక్రమంలో డీన్‌లు ఆచార్య కె.వెంకట రావు, ఆచార్య డి.వి.ఆర్ మూర్తి, డాక్టర్ ఎస్.హరనాథ్, ధనరాజ్, రామారావు, స్వామిదాస్ గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సబ్బవరం పిహెచ్‌సి స్థాయి పెంపు



సబ్బవరంః సబ్బవరం ప్రభుత్వ ఆసుపత్రిని తిరిగి 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి ఆళ్ల కాశీ కృష్ణ శ్రీనువాస్ (ఆళ్ల నాని) హామీ ఇచ్చారు. ఈ మేరకు బుధవారం అమరావతిలో మంత్రి కార్యాలయంలో పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అధీప్‌రాజ్ ఆయనతో చర్చించినట్లు ఇక్కడి విలేఖర్లకు సమాచారం పంపిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో 30 పడకలుగా ఉన్న సబ్బవరం ప్రభుత్వ ఆసుపత్రిని గత తెలుగుదేశం ప్రభుత్వం డీ-గ్రేడ్ చేసి సాధారణ పిహెచ్‌సిగా మార్చిందన్నారు. దీంతో స్టాఫ్ ప్యాట్రన్ తగ్గడంతో పాటు వైద్య ఆరోగ్య శాఖ ద్వారా విడుదలయ్యే బడ్జెట్‌లో తేడా మందుల సరఫరాలో లోపాలతో ఇక్కడి ఆసుపత్రి అస్తవ్యస్తంగా తయారయిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మండల ప్రజలు తనకు చేసిన విజ్ఞప్తిపై స్పందించి తాను వెంటనే వైద్య ఆరోగ్య శాఖా మంత్రిని కలిసి సబ్బవరం మీదుగా వెళ్తున్న 16వ నెంబరు జాతీయ రహదారి ప్రమాదాలు, విద్యా హబ్‌గా తయారవుతున్న తరుణంలో అంతర్జాతీయ విద్యా ప్రమాణాలు కలిగిన జాతీయ విశ్వ విద్యాలయాల నిర్మాణాలను దృష్టిలో ఉంచుకుని తిరిగి సబ్బవరం పిహెచ్‌సిని అప్‌గ్రేడ్ చేయాలని కోరినప్పుడు మంత్రి సానుకూలంగా స్పందించడంతో పాటు వెంటనే ఉత్తర్వులు జారీ చేస్తానని ప్రకటించారని పేర్కొన్నారు.

దీంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వైద్య ఆరోగ్య శాఖా మంత్రి కృష్ణశ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

# నేటిబాలలే రేపటి భావిపౌరులు



విశాఖ సిటీః నేటి బాలలే రేపటి భావి పౌరులని గ్రేటర్ విశాఖ 37వ వార్డు పెదకొత్తూరులో వున్న అంగన్వాడీ స్కూల్లో వార్డు వైకాపా నాయకుడు నీలి రవి కేక్ కటింగ్ చేసి చిన్నారులకు బాలల చిల్డ్రన్స్ డే సందర్భంగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ పిల్లలు బాగా చదువుకుని సంఘానికి, తద్వారా దేశానికి మంచి పేరుప్రతిష్టలు తెచ్చే విధంగా ఎదగాలని పిల్లలకు శుభాకాంక్షలు తెలియజేశారు. చిన్నారులు పలు దేశనేతల వేషధారణలో అలరించారు. అనంతరం పిల్లలకు స్వీట్స్, చాక్లెట్స్ ఇవ్వడం జరిగినది..

కార్యక్రమంలో టీచర్ నూకరత్నం, చదువుకుంటున్న పిల్లలు తల్లితండ్రులు, శాంతమ్మ, లక్ష్మి, పోలింగ్ బూత్ ఇంచార్జిలు అనిల్, ఈశ్వర్ మరియు ప్రసాద్, ఆనంద్, భాస్కర్, బాషా తదితరులు పాల్గొన్నారు.

# అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

**నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్**



నర్సీపట్నంః మన పిల్లలందరూ బడికి వెళ్లి మధ్యలో మానకుండా ఉండాలంటే వారికి అవసరమైన సమస్త సదుపాయాలను నూటికి నూరు శాతం కల్పించే ఉద్దేశంతో మన రాష్ట్ర ముఖ్యమంత్రి మన బడి నాడు-నేడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ తెలిపారు. గురువారం పెదబడ్డేపల్లి వద్ద గల ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో మనబడి నాడు-నేడు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో తొలి సారిగా సువర్ణ అక్షరాలతో లిఖించే విధంగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. నర్సీపట్నం నియోజకవర్గం పరిధిలో గల 230 ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి మొదటి దశలో 103 పాఠశాలలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. నవంబర్ 14వ తేదీ బాలల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా మనబడి నాడు-నేడు కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు.

ఆర్‌డిఒ ఆర్.గోవిందరావు మాట్లాడుతూ విద్యార్థులు ఇంట్లో కన్నా పాఠశాలలోనే ఎక్కువ సమయం గడిపే అవకాశం ఉన్నందున, మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో అవసరమైన మౌలిక వసతుల కల్పన, విద్యార్థులను ఆకర్షించే విధంగా రూపొందించడం ద్వారా భవిష్యత్తులో వారిని మంచి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ కృష్ణవేణి, నియోజకవర్గ నాలుగు మండలాల ఎంఇఒలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, నర్సీపట్నం మాజీ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసి పాత్రుడు, మున్సిపాలిటీ వైసిపి అధ్యక్షులు కోనేటి రామకృష్ణ, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌లు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జగన్ చిత్రపటానికి పాల అభిషేకం చేసిన ఆర్పిలు



మధురవాడ : మహా విశాఖ 4 వార్డు లో ఆర్ పి (రీసోర్స్ పర్సన్స్)లకు ఆంద్రప్రదేశ్ గౌరవ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జీతం పెంచిన శుభ సందర్భంగ అవంతి ఫంక్షన్ హాల్ వద్ద కేక్ కట్ చేసి థాంక్యూ జగనన్న అంటూ నినాదాలు చేస్తూ జగన్ చిత్ర పటానికి పాల అభిషేకం చేసారు, అనంతరం వైసిపి వార్డ్ అధ్యక్షుడు బొట్టా అప్పలరాజు ఆద్వర్యంలో పీఎంపాలెం చివరి బస్సు స్టాప్ వరకు ర్యాలీ నిర్వహించారు.

ఈసందర్భంగ బొట్టా అప్పలరాజు మాట్లాడుతూ అధికారంలోకి రాక ముందు పాదయాత్ర లో ఇచ్చిన వాగ్దానాన్ని తూచ తప్పకుండా నూటికి నూరు శాతం అమలు చేస్తున్న ఏకైక ముఖ్య మంత్రి జగన్ అన్నారు అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లో అవగాహనా కల్పించి అర్హులైన లబ్దిదారులకు అందేలా కృషి చెయ్యాలని ఆర్పీ లను కోరారు, ఆర్పి ఈ ఎన్ ఎస్ కనకదుర్గ మాట్లాడుతూ మాకష్టం చూసి జగనన్న మూడు వేలు వేతనం నుంచి పది వేలకు పెంచుతూ ప్రకటించడం మంచి పరిణామమని తండ్రిని మించిన తనయుడు అనిపించుకున్నాడు అని హర్షం వ్యక్తంచేశారు, కార్యక్రమంలో ఆర్పీలతో పాటు వైకాపా వార్డు నాయకులు పోతిన ఎల్లాజీ, పిళ్ళా రమణ, పోతిన శివ , పోతిన మూర్తి, ఎస్ శ్యామలరావు, రాఘవ చారి, 4 వ వార్డ్ మహిళా అధ్యక్షురాలు కొండపల్లి వరలక్ష్మి, వార్డ్ వాలంటర్లు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం



సీతమ్మధార : ఆంద్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు వై.యస్.జగన్మోహన్ రెడ్డి ఆర్ .పి లకు 10,000/- రూపాయలు గౌరవవేతనం పెంచినందుకు గురువారం విశాఖ ఉత్తర నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో వై.యస్.జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి విశాఖ ఉత్తర నియోజకవర్గ ఆర్ .పి లు అందరూ పాలాభిషేకం చేశారు ఈ కార్యక్రమంలో గుంటూరు నరసింహమూర్తి గారు, రాష్ట్ర,పార్లమెంట్, సిటీ, నాయకులు, మాజీ కార్పొరేటర్లు,వార్డు అధ్యక్షులు,అనుబంధ సంఘాల అధ్యక్షులు నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# అడివివరం శాఖా గ్రంథాలయంలో జాతీయ వారోత్సవాలు ప్రారంభం





సింహాచల ం: 72 వ వార్డు అడివివరం శాఖా గ్రంథాలయంలో 52 వ అంతర్జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి

ఈ కార్ర్యమానికి సింహాచలం దేవస్థానం ఈ ఓ ఎం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారభించారు నెహ్రూ జయంతి పురస్కరించుకుని నెహ్రూ ఫోటోకి పూలమాల వేసి అనంతరం జాతీయ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గ్రంథాలయ ఆవశ్యకత ను వివరించారు బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులు పలు వేషధారణలతో అలరించారు ఈ కార్యక్రమంలో దేవస్థానం ఏ ఈ ఓ వై శ్రీనివాసరావు తిరుమలేశ్వర రావు గ్రంథాలయం అధికారి పి వి యన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## సుప్రీం చారిత్రాత్మక తీర్పు

భారత ప్రధాన న్యాయమూర్తి పదవిని సమాచారహక్కు పరిధిలోకి తేవడాన్ని సమర్థిస్తూ సుప్రీంకోర్టు రాజ్యాంగపీఠం ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమైనది, పారదర్శకతకు పట్టం కట్టేది, ప్రజాస్వామ్యస్ఫూర్తికి అనుగుణమైనది. సమాచారహక్కు చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నాలు సాగుతున్న సందర్భంలో ప్రధాన న్యాయమూర్తి పదవిని కూడా ఈ చట్టం పరిధికిలోకి తేవడం విశేషం. దీనివల్ల సమాచారహక్కు ఉండాలనే వాదనను మరింత బలోపేతం చేసినట్టయింది. సమాచారహక్కు పరిధిలోకి ప్రధాన న్యాయమూర్తి పదవిని కూడా తెస్తూ ఢిల్లీ హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును సమర్థిస్తూనే, పారదర్శకత న్యాయవ్యవస్థ స్వతంత్రతకు విఘాతం కలిగించదని కూడా న్యాయస్థానం స్పష్టం చేసింది. అయినా న్యాయవ్యవస్థ స్వతంత్రతకు భంగం వాటిల్లకుండా రాజ్యాంగ పీఠం జాగ్రత్తలు తీసుకున్నది. గుప్తత, గోప్యతా హక్కును కాపాడాలని కూడా ధర్మాసనం ఈ సందర్భంగా స్పష్టం చేసింది. సమాచార హక్కును నిఘా పరికరంగా వాడకూడదని కూడా అభిప్రాయపడ్డది. 2010 జనవరి 10వ తేదీన ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవిని సమాచార హక్కు పరిధిలోకి తెస్తూ తీర్పునిచ్చింది. సమాచార హక్కు, గోప్యతా హక్కు నాణేనికి రెండు వైపులంటూ, దేనికీ అధిక ప్రాధాన్యం ఉండదని న్యాయస్థానం వివరించింది. ప్రధాన న్యాయమూర్తి పదవికి సంబంధించి సమాచారం ఇచ్చే ముందు గోప్యతా హక్కుకు, పారదర్శకతకు మధ్య సమతుల్యత పాటించాలని ధర్మాసనం సూచించింది. న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి కూడా రాజ్యాంగపీఠం స్పష్టతనిచ్చింది. ఐదుగురు అత్యంత సీనియర్ జడ్జిలతో కూడిన సుప్రీం కోర్టు కొలీజియంలో సాగిన చర్చల వివరాలను బయటపెట్టవచ్చా అనే అంశంపై కూడా ధర్మాస నం వివరించింది. ఆయా కేసును బట్టి విస్తృత ప్రజా ప్రయోజనాల దృష్ట్యా నిర్ణయించాలని సూచించింది. కొలీజియం సూచించిన న్యాయమూర్తుల పేర్లు మాత్రమే వెల్లడించాలని అందు కు కారణాలను వెల్లడించకూడదని కూడా పేర్కొన్నది. రాచరిక యుగం అంతరించి ప్రపంచవ్యాప్తం గా ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఏర్పడినా రహ స్య విధానాలు సాగుతున్నాయి. దీంతో పారదర్శకత భావన బలపడ్డది. పరిపాలనా రంగంలో ఉన్న వారి నిర్ణయాలు ప్రజలపై ప్రభావం చూపుతాయి. అందువల్ల పాలనారంగంలో ఉన్నవారి నిర్ణయాలను, ఇతర సమాచారాన్ని తెలుసుకునే హక్కు ప్రజలకు ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా వంద దేశాలకు పైగా ఏదో ఒక రీతిలో సమాచార హక్కును గుర్తించాయి. మన దేశంలో సమాచార హక్కు చట్టం 2005 అక్టోబర్ 12వ తేదీ నుంచి అమలులోకి వచ్చింది. ప్రభుత్వం దగ్గర ఉన్న సమాచారాన్ని సామాన్య పౌరుడు కూడా తెలుసుకునే హక్కు కల్పించడం వల్ల పాలకులలో వ్యతిరేకత మొదలైంది. ఒకటి రెండు అంశాల్లో సమాచార కమిషన్ ఇచ్చిన ఆదేశాలు కీలక స్థానాలలో ఉన్న వారిని ఇబ్బంది పెట్టాయి. ప్రభుత్వరంగ బ్యాంకుల మొండి బకాయిల వివరాలను వెల్లడించడానికి సమాచార కమిషన్ ఆదేశాలు ఇవ్వడం పట్ల కూడా వ్యతిరేకత వ్యక్తమైంది. అప్పులు ఎగవేసిన పెద్దల వివరాలను వెల్లడించాలని రిజర్వుబ్యాంక్‌ను సమాచార కమిషన్ ఆదేశించింది. అయితే ఈ సమాచారం రహస్యమైనదంటూ ఆర్‌బీఐ నిరాకరించింది. ఈ అంశం సుప్రీంకోర్టుకు పోయింది. పరమోన్నత న్యాయస్థానం కూడా ఈ ఎగవేతదారుల సమాచారాన్ని వెల్లడించాలని రెండుసార్లు ఆదేశించింది. దీంతో సమాచార హక్కు చట్టాన్ని ప్రజలు ఉపయోగించుకోవడం వల్ల ఇరుకునపడుతామనే భయం కేంద్ర పాలకులకు ఏర్పడ్డది. వెంటనే తమకు ఇబ్బందికరంగా ఉన్న సమాచార కమిషనర్ల పరిధిలోని అంశాలను తప్పించడం వంటి చర్యలకు ఒడిగట్టారు. ఒకవైపు సమాచార కమిషన్‌పై ఒత్తిడి తెస్తూనే, మరోసారి దాన్ని నిర్వీర్యం చేశారు.పాలనారంగంలో ఉన్నవారి కార్యకలాపాలు, అధికారాలు విధులు, ఆర్థిక వ్యవహారాలు మొదలైన సమాచారమంతా ప్రజలు తెలుసుకునే అవకాశం ఉండటంతో దీన్ని నిర్వీర్యం చేయడానికే పాలకులు నిర్ణయించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఈ చట్టానికి సవరణలు తేవడం ద్వారా సమాచార కమిషన్‌నే నిర్వీర్యం చేసింది. సమాచార కమిషనర్లకు అంతకుముందు నిర్దిష్ట పదవీ కాలం, ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్లతో సమానమైన హోదా, వేతనం ఉండేవి. ప్రభుత్వ జోక్యం లేకుండా కేంద్ర సమాచార కమిషన్‌కు స్వయంప్రతిపత్తి ఇవ్వడానికి ఈ ఏర్పాటు చేశారు. కానీ మోదీ ప్రభుత్వం నిర్దిష్ట పదవీకాలాన్ని, వేతనాలను తొలగించింది. దీంతో పదవీకాలం, వేతనాల కోసం ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వం దయ మీద ఆధారపడవలసిన పరిస్థితిని కల్పించింది. ప్రభుత్వ అధికారుల కన్నా తక్కువ స్థితికి కమిషనర్లను దిగజార్చిం ది. రాష్ట్రాల సమాచార కమిషన్ విషయంలో అధికారాలు తమకే దత్తం చేసుకున్నది. ఇప్పుడు సుప్రీం కోర్టు తాజా తీర్పు మూలంగా మళ్ళా సమాచార హక్కుపై చర్చ మొదలైంది.

## ఏవిఎన్ కళాశాలలో జాతీయ సదస్సుపై కరపత్రం విడుదల



విశాఖపట్నం : స్థానిక 159 సంవత్సరాల చరిత్ర కలిగిన మిస్సెస్ ఏ వి ఎన్ కళాశాలలో విపత్తు నిర్వహణ - శాస్త్రీయత అనే అంశంపై ఈనెల 23 మరియు 24 తేదీలలో యూజీసీ జాతీయ సదస్సు భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరుగుతుంది .

కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డి విజయ ప్రకాష్ ఈ సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. భౌతిక శాస్త్ర విభాగ అధిపతి ఆచార్య ఎస్. శ్రీనివాస రావు కన్వీనర్ గాను, కెప్టెన్. ఆచార్య. చీ. రామకృష్ణ, డాక్టర్. సి. మమత, డాక్టర్. వీ వీ జే గోపాల్ కృష్ణ కో - కన్వీనర్ గాను వ్యవహరిస్తున్నారు. యునైటెడ్ నేషన్స్ డెవలప్మెంట్ ప్రోగ్రాం - గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మరియు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ సాంకేతిక సహాయంతో ఈ జాతీయ సదస్సును నిర్వహిస్తున్నామని ఆచార్య విజయ్ ప్రకాష్ తెలియజేశారు. యు ఎస్ ఏ ఐ డి ప్రాజెక్ట్ సిటీ కోఆర్డినేటర్ ఎం శ్రీనివాస రాజమణి సహకారంతో ఈ ఈ సదస్సు బాధ్యతలను నిర్వహిస్తున్నామని కన్వీనర్ ఆచార్య ఎస్ శ్రీనివాస రావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చీ. కృష్ణవేణి. ఆచార్య సిహెచ్ మధుసూదనరావు. ఆచార్య సీతారత్నం, కెప్టెన్. డాక్టర్.చీ. రామకృష్ణ మరియు

## అనంతగిరిలోనే పరిక్షా కేంద్రం - అరకు ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ హామీ

అనంతగిరి : మండలంలో జూనియర్ కళాశాల విద్యార్థులు తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరుకుంది. దీక్ష శిబిరానికి వచ్చిన ఎమ్మెల్యే విద్యార్థులతో మాట్లాడారు. మీరు దీక్ష విరమించాలని కోరారు, ఇంటర్మీడియట్ బోర్డు అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం చేస్తానన్నారు.

ఈ కార్యక్రమంలో అనంతగిరి మాజీ ఎంపిటిసి సభ్యులు దీసరి గంగరాజు మాట్లాడుతూ ఇంతకు మునుపు అనేక సార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెప్పారు. ఎమ్మెల్యే చెట్టి ఫాల్ఘుణ హమీతో విద్యార్థులు దీక్ష విరమించారు, ఈ కార్యక్రమంలో శెట్టి ఆనంద్, గిరిజన సంఘం నాయకులు కొండలరావు, నాగులు, విద్యార్థులు ఈశ్వరరావు, మోహనరావు తదితరులు పాల్గొన్నారు,

## విజినిగిరిపాలెంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో

# ఉచితంగా మొక్కలు పంపిణీ



సింహాచలం : 72 వ వార్డు పరిధి సింహాచలం విజినిగిరిపాలెంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో ఉచితంగా మొక్కలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు కార్తీకమాసంలో సత్యనారాయణస్వామి వ్రతం చేయడం వలన ఆయురారోగ్యాలతో పాటు అష్టైశ్వర్యాలు కలుగుతాయని నమ్మకం సింహాచలం పరిధి విజినిగిరిపాలెం గ్రామంలో మారుతి సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పురోహితులు సంతోష్ సారధ్యంలో సత్యనారాయణస్వామి వ్రతం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్మార్ట్ వార్డ్ కో ఆర్డినేటర్ విజినిగిరి. బాలభానుమూర్తి, అడవివరం సొసైటీ డైరెక్టర్ లోగిశ. గణేష్ తో కలసి పర్యావరణ పరిరక్షణలో బాగంగా ప్రతి ఇంటి ముందు ఒక మొక్క నాటి వాటిని సంవరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలని ఉద్దేశ్యంతో సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న జంటలకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు తినే ఆహారాన్ని పరిశీలించి, రుచి చూస్తున్న యువనాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య

## పాపాహోంలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



విశాఖపట్నం : సూర్యాభాగ్ దరి పోలీస్ రిజర్వ్ బ్యారెక్స్ క్వార్టర్స్‌లో గల పబ్లిక్ & పోలీస్ అసోసియేషన్ ఫర్ స్ట్రీట్ చిల్డ్రన్ పాపాహోం ప్రాంగణంలో పండింట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి.ప్రేమ కాజల్ హాజరై జ్యోతిని వెలిగించి జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ భారతదేశ తొలి ప్రధానిగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ భారతదేశ ఉన్నతికి నిస్వార్థంగా సేవలందించారని తెలిపారు. చాచానెహ్రూకి చిన్న పిల్లలంటే ఎంతో ఇష్టమని అందువలన బాలల దినోత్సవ వేడుకలను భారతదేశస్థాయిలో నిర్వహించడం జరుగుతుందన్నారు. పాపాహోంలో ఆశ్రయం పొందుతున్న ప్రతి విద్యార్థి చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. పాపాహోం కమిటీ సభ్యులు చేపడుతున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. సంస్థ అధ్యక్షులు పి.సత్యనారాయణ మాట్లాడుతూ పాపాహోంను నిర్వహిస్తున్న తీరును తెలిపారు. అనంతరం వివిధ సాంస్కృతిక పోటీల్లో విజేతలుగా నిలిచిన పాపాహోం విద్యార్థులకు ముఖ్యఅతిథి చేతుల మీదుగా బహుమతులనందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు పి.సత్యనారాయణ, సంస్థ కార్యదర్శి హేమచందర్, పాపాహోం ప్రతినిధులు డి.సూర్యప్రకాశరావు, పి.వెంకటేశ్వరరావు, రమేష్ చంద్ జైన్, ఎండి. షంషుద్దీన్, పిఆర్వో ఎం.వి.రాజశేఖర్, పాపాహోం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జనసైనికులతో సుందరపు సమావేశం



అచ్యుతాపురం : జనసేన పార్టీ అదినేత పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు భవన నిర్మాణ కార్మికులకు రెండు రోజుల పాటు డొక్కా సీతమ్మ ఆహార పంపిణి కార్యక్రమానికి జనసైనికులు సిద్ధం కావాలని జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుందరపు విజయ కుమార్ అన్నారు . గురువారం స్థానిక జనసేన పార్టీ కార్యలయంలో ఆయన జనసైనికులతో సమావేశం ఏర్పాటు చేశారు .ఈ సమావేశం లో సుందరపు జనసైనికులతో భవన నిర్మాణ కార్మికులకు ఆహార పంపిణి శిబిరాలు ఏర్పాటుపై , మండల ,గ్రామ స్థాయి కమిటీలపై చర్చించారు . ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రామునాయుడు , జనసైనికులు మేరుగు ప్రవీణ్ కుమార్ , మేరుగు వసంతరావు తో పాటు నియోజకవర్గంలో తదితర జనసైనికులు పాల్గొన్నారు .

## గ్రంధాలయ వారోత్సవాలు ప్రారంభం



నాతవరం : నాతవరం శాఖా గ్రంధాలయంలో జవహర్‌లాల్ నెహ్రు 130వ జయంతి వేడుకలు, 52వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మండల తహశీల్దార్ జి.శ్రీనివాస్ హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గ్రంధాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పాఠశాల నుడి రత్నకుమారి, సన్‌షైన్‌ఉపాధ్యాయులు, సుమారు 50 మంది విద్యార్థులు, గ్రంధాలయాధికారి ఆర్.కన్నబాబు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులు తమవంతు పిల్లల కోసం కృషి చేయాలి : మంత్రి అవంతీ



భీమునిపట్నం: అందరూ చదవాలి అందరూ ఎదగాలి అనే కాంక్షతో రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల శాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన బాలల దినోత్సవం మరియు నాడు నేడు (మనబడి) కార్యక్రమం గురువారం ఆనందపురం మండలం గిడిజాల గ్రామంలో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల నందు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు యువజన సర్వీసుల శాఖ మంత్రివర్యులు ముత్తంశెట్టి శ్రీనివాస రావు చేతుల మీదుగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అవంతీ మాట్లాడుతూ గురువారం చాల పవిత్రమైన బాలల దినోత్సవం సందర్భంగా ఈ యొక్క కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం ప్రారంబించటం జరిగింది. నేటి బాలలే రేపటి పౌరులు అనే ఆలోచనతో మనబడి నాడు నేడు కార్యక్రమం ఏర్పాటు చేశారని, మనబడి నాడు నేడు పథకం పై అన్ని గవర్నమెంట్ పాఠశాలకు మరమత్తులు, మరియు పిల్లలకు అన్ని సౌకర్యాలు కలిపించేందుకు పదిహేను వందల కోట్లు మంజూరు చేసారని చెప్పారు. పాటశాలలు బాగుండాలి విద్యా వ్యవస్థ అత్యత్భుతంగా ప్రతిష్టాత్మకంగా సాగాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఈ పథకం అమలు చేసారని చెప్పారు. మన రాష్ట్రాన్ని విద్యా సంస్కరణలతో యావత్ భారత్‌దేశం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైపు చూపు తిప్పుకొని చూస్తున్న తరుణంలో స్వాతంత్రం వచ్చిన తరువాత కూడా ఎన్నో ప్రభుత్వాలు వచ్చిన కూడా విద్యా మీద ఇంత పెద్ద ఎత్తున కర్చు చేయ టం కానీ విద్య సంస్కరణలు చేపట్టడం కానీ చెయ్యలేదు అని, బడుగు, బల హీన వర్గాల వారికి, దళితులకు, గిరిజను లకు, పేద అగ్ర వర్ణాల వారికి ఈ దేశ చరిత్ర లోనే చిర స్థాయిగా ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ ను ప్రారంబించటం విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకున్న మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రారంబించిన ఘనత ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహనరెడ్డి కే దక్కుతుందని చెప్పారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పాఠశాలలో మౌలిక వసతులు అందించాలనే ఆలోచనతో ప్రతి పాఠశాలలో మౌలిక వసతులు కలిగి ఉండాలని మనబడి నాడు- నేడు కార్యక్రమం నిర్వహించారని చెప్పారు. మన ఆంధ్రప్రదేశ్ లో 34% గవర్నమెంట్ పాటశాలలో ఉన్నప్పుడే ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ ఏర్పాటు చేసారని అలాగే ప్రైవేటు స్కూల్ పర్సంటేజ్ 95% ఇంగ్లీష్ మీడియం ఉందని . దీనివల్ల తల్లి తండ్రులు పిల్లల కోసం వాళ్ళ ఆస్తులు అవి అమ్ముకొని పిల్లల్ని ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ లో చదివించేందుకు ప్రస్తుతం ఎల్ కె జి లో కూడా లక్ష రూపాయలకి చేరిపిస్తునారంటే మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తప్ప వేరే ఎక్కడ కూడా ఇలాంటి పరిస్థితి రాలెదు అని చెప్పారు. దీన్ని ఉద్దేశించి మన సిఎం జగన్మోహనరెడ్డి గారు ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకొని ప్రభుత్వ పాఠశాలలు అన్నిటికి కూడా ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ అమ్మబడి పథకం పెట్టి అమ్మబడి ద్వారా జనవరి 9 నుంచి బడికి పంపించే తల్లులందరికి కూడా పదిహేను వేలు ప్రతి తల్లి బ్యాంకు అకౌంట్ లో జమ చేస్తుందని తెలిపారు. మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 45వేల స్కూళ్లను ఈ కార్యక్రమం ద్వారా బాగుచేస్తున్నామని, దశలవారీగా జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ, గురుకుల, హాస్టళ్లకు అన్నివసతులూ కల్పిస్తుందని తెలిపారు. అలాగే ప్రతి విద్యార్థి చదువుకొని మన దేశానికీ, తల్లి తండ్రు కు మంచి పేరు తీసుకొని రావాలని మంత్రి అవంతి శ్రీనివాస రావు కోరారు.ఈ కార్యక్రమం లో వివిద శాఖల అదికారులు నాయుకులు పాల్గొన్నారు.

## బాలల దినోత్సవం సందర్భంగా చిత్రలేఖనం పోటీలు

భీమునిపట్నం: బాలల దినోత్సవం, పండిట్ జవహర్ లాల్ జయంతి సందర్భంగా గురువారం ప్లాస్టిక్ నిషేదం-కాలుష్య నివారణ అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్లు యువభారత్ భీమిలి శాఖ కన్వీనర్ ఎస్. జోగారావు తెలిపారు. ఈ కార్య క్రమంలో విన్నర్స్ కు స్థానిక సెయింట్ ఆన్స్ హైస్కూల్ లో బహుమతులు అందజేశారు. మొదటి,రెండవ బహుమతులు విజ్ఞాన్, పి.ఎన్.ఎం స్కూల్, మూడవ బహుమతి ఎ.ఎన్.ఎం హైస్కూల్, సెయింట్ ఆన్స్ హైస్కూల్ నుంచి ఒకొక్కరు, కన్సొలేషన్ బహుమతులు పీ.ఎన్.ఎం హైస్కూలు నుంచి ఇద్దరు, విజ్ఞాన్ ఒకరు, గవర్న మెంట్ హైస్కూల్ నుంచి ఇద్దరు గెలుచుకున్నట్లు చెప్పారు.

రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 Minimum 7 days విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

**CHANGE OF NAME**
I, KESIMENI SRINIVAS (Old Name) S/o.KISIMONU PENTAYYA, Residing at D.No. RGP B-33, SF-7, RAJIV GRUHA KALPA, DAIRY FARM, KAKINADA, EAST GODAVARI, AP changing my name from KESIMENI SRINIVAS (OLD Name) to **KISIMONU RAMANA** (New Name) S/o. KISIMONU PENTAYYA hence forth I am being called as **KISIMONU RAMANA** (New Name) for all purposes.

## ఘనంగా అయ్యప్ప అంబలంపూజ

చీడికాడ : మండలంలోని కరక గ్రామంలో అయ్యప్ప స్వామిఅంబలంపూజ ఘనంగా నిర్వహించారు.గ్రామానికి చెందిన 40మంది స్వాములు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అరటిడొప్పలతో స్వామి గుడి నమూనాను ఏర్పాటు చేసి పూజలు జరిపారు. అయ్యప్పస్వామి శరణు ఘోషతో ఆధ్యాత్మికత వెల్లి విరిసింది.



**గోపాలపట్నం E-బ్లాక్ నివాసితులు సాయిబాబా, భవాని దంపతులు గురువారం గౌరవ శాసనసభ్యులు గణబాబుని కలిసి వారి కుమారుడు తాళ్లపర్తి వెంకట కోమల్ (ఎనిమిది నెలలు) ముందుగా ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్షలు చేయించగా డెంగ్యూ మరియు నిమోనియా అటాక్ అయింది అని చెప్పగా కెజిహెచ్ ప్రభుత్వా సుపత్రిలో చేర్చి డెంగ్యూ జ్వరానికి వైద్యం పొందుతూ మరణించాడని వాపోయారు. ప్రభుత్వం సాయం కోరుతూ గణబాబుకి వినతి పత్రం ఇచ్చారు. ఈ విషయంపై ఘనబాబు స్పందిస్తూ తక్షణమే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి వారికి ఆర్థిక సహాయం చేకూరేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు.**

## ఘనంగా పివిజి.రాజు 24వ వర్ధంతి



భీమునిపట్నం : స్థానిక అదర్స్ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షులు కాళ్ళ సూర్య రామకృష్ణారావు ఆధ్వర్యంలో పాత బస్సు స్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ పి.వి.జి.రాజు 24వ వర్ధంతి కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం కు ముఖ్య అతిదిగా పొట్టి శ్రీరాములు నగరపాలకోన్నత పాటశాల హెచ్ యం సిహెచ్ సింహాచలం పాల్గొని పి.వి.జి రాజు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ డాక్టర్ పి.వి.జి రాజు మాన్సాస్ సంస్థ ను స్థాపించి ఆ ట్రస్ట్ ద్వారా అనేక విద్యా సంస్థలను, ధార్మిక సంస్థలను నడిపిస్తూ సుమారు పద్నాలుగు విద్యా సంస్థలు ఈ నాటికి దిన దినాభివృద్ధి చెందు తున్నాయని.కోరుకొండ స్కూల్ కి వెయ్యి ఎకరాలు ఉచితంగా ఇచ్చారని ,నూట ఎనిమిది దేవాలయాలకు అనువంశిక ధర్మకర్త గా వ్యవహరించారని, నాలుగుసార్లు పార్లమెంట్ సభ్యులుగా, రెండుసార్లు విదానసభ సభ్యులుగా అలాగే విద్యాశాఖమంత్రిగా విదులు నిర్వహించారని అన్నారు. అనంతరం వ్యాసరచన పోటిల్లో గెలిచినా విద్యార్ధులకు బహుమతులు అందజేశారు.

## వ్యాపారవేత్త మణికంఠ స్వీట్స్ అధినేత సన్మానం



భీమునిపట్నం: బాలల దినోత్సవం సందర్భంగా తగరపువలస , చిట్టివలస ఏరియా లో గల ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నో సేవలు చేస్తున్న మన ప్రముఖ వ్యాపారవేత్త మణికంఠ స్వీట్స్ అధినేత ఆదిమూలం సత్యన్నారాయణ కి సంతపేట అంబేద్కర్ పాఠశాల లో వుయ్ కేర్ యు మరియు హెల్పింగ్ హేండ్స్ వారి ఆధ్వర్యంలో గణంగా ఆయనకు సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు స్వామి, నెహ్రు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈశ్వరరావు వై యస్ ఆర్ సి పి నాయకులు జి వి రమణ వెంపాడ శ్రీనివాసరెడ్డి మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే రాయిప్పాలెం జివిఎంసి ప్రాదిమక పాతసాల లో పాఠశాల హెచ్ ఎం రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు,ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విశ్వ సౌభాగ్యానికి విద్యార్ధులే పట్టు గొమ్మలని విజ్ఞాన తరంలో ఉన్నవారు రాబోయే తరానికి ఆదర్శంగా నిలవాలని అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటిల్లో గెలిచిన వారికి బహుమతులు అందజేశారు.



**గిరీషాస్ శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్, ఎన్‌హెచ్5 కంచరపాలెంలో 8వ తరగతి చదువుచున్న విద్యార్థిని గొర్ల సిరి 65వ స్టేట్ స్కూల్ గేమ్స్ 2019-20 స్టేట్ కరాటే ఛాంపియన్షిప్ కం సెలక్షన్ అండర్ 14 ఇయర్స్ గర్ల్స్ స్టేట్ లెవెల్‌లో గోల్డ్ మెడల్ సాధించినందుకుస్కూల్ డైరెక్టర్ సోమశేఖర్‌రావు, జి.సిరిని అభినందించారు. అంతేకాకుండా నేషనల్ లెవెల్‌లో కూడా గోల్డ్ మెడల్ సాధించాలని తెలిపారు.**

## మంత్రి కురసాల కన్నబాబుకు స్వాగతం పలికిన కె.కె.రాజు



**విశాఖసిటీ : గురువారం ఉదయం విశాఖపట్నంకు విచ్చేసిన విశాఖ జిల్లా ఇంచార్జ్ మంత్రి కురసాల కన్నబాబు ను రైల్వే స్టేషన్ లో కలిసి సాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికిన విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు నగర అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్.**

# ఘనంగా బాలల హక్కుల వారోత్సవాలు




అనంతగిరి : టోకురు బాలిక ఆశ్రమోన్నత పాఠశాలలో బాలల హక్కుల వారోత్సవాలు దిమ్సా ఫౌండేషన్ ఆధ్వర్యములో గిరిచైతన్య, ట్రైబల్ ఫౌండేషన్ స్వచ్ఛంధ సంస్థల అధ్యక్షతన గురువారం ఘనంగ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భాగంగ సుమారు 300 మంది విద్యార్థినిలతోపాఠశాల నుండి బగ్మర వలస వరకు ఈ నాటి బాలలే రేపటి పౌరులు బాల్యవివాహం అరికడదాం, బాలల దినోత్సవం వర్ధిల్లాలి అను నినాదాలతో గిరిజన గ్రామాలప్రజలను అవగాహన కల్పిస్తూ ర్యాలీ కొన సాగించారు. ర్యాలీ అనంతరం పాఠశాల ఆవరణంలో మానవ హారంగా ఏర్పడిన విద్యార్థినిలు చక్కటి జాతీయగితాన్ని పాడి విలపించారు.అలాగే కార్యక్రమాన్ని పురస్కరించుకుని ప్రధానోపాధ్యాయులు మన్మధరావు, సహ ఉపాధ్యులు రవణ విద్యార్థుల నుద్దేశించి మాట్లా డుతూ, నేటిబాలలే రేపటి పౌరులని, విద్యార్థులంతా ఓర్పు సహనం బుద్ధిగా చదువుపట్లశ్రద్ధతో విద్యభ్యాసించి గొప్ప విద్యా వంతులు అవ్వాలని అన్నారు అలాగే చదువు తో పాటు విజ్ఞానం వస్తుందని బాగా చదివి విజ్ఞానంపొందాలని మంచిపౌరులుగా వెదిగి దేశానికి సేవాలందించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంధసంస్థ ప్రతినిధులు కె.చంద్ర రావు, గిరిచైతన్య, శెట్టి, కొండప్ప ట్రైబల్ఫౌండేషన్ ఉపాధ్యా యుల బృందం విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే కోండిబ పంచా యతీ నడిమివలస ఎంపిపి, పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎన్.మల్లేశ్వరావు ఆధ్వర్యంలో బాలలదినోత్సవకార్యక్రమం నిర్వ హించారు అలాగే ఆనంతగిరి ఎంపిపిపాఠశాల బాలల దినోత్సవ కార్యక్రమానికి మండల విద్యాశాఖాధికారి ఎల్.బి.వెంకటరావు ముఖ్య అతిధిగా పాల్గొని నెహ్రు చిత్రపటానికి పూలమాలేసి అక్కడి బాలల నుద్దేశించి మాట్లాడుతూ, విద్య యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులు కె చంద్రరావు గిరిచైతన్య, శెట్టి కొండప్ప ట్రైబల్ ఫౌండేషన్ పాల్గొన్నారు.

# వాగ్దేవిలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు


**- విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను పెంపొందించుకోవాలి - ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్**




విశాఖపట్నం : అక్కయ్యపాలెం వాగ్దేవి స్కూల్‌లో పండిట్ జవహర్‌లాల్ నెహ్రు జయంతిని పురస్కరించుకొని బాలల దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించినాము. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎమ్.వి. రాజశేఖర్ ప్రసంగిస్తూ విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నతమైన లక్ష్యాలను పెంపొందిచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించి బావిభారత పౌరులుగా ఎదగాలన్నారు. ఉత్తమ విద్యావంతులై ఎదిగి పాఠశాలకి, తల్లిదండ్రులకి మంచి కీర్తిని తీసుకురావాలని కోరారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను కల్పించే దిశగా చక్కని ఆశయాలతో వాగ్దేవి స్కూల్‌ను నిర్వహిస్తున్నందుకు పాఠశాల యాజమాన్యాన్ని ప్రశంసించి విద్యార్థులను అభినందించారు. వివిధ సాంస్కృతిక అంశాలతో అందరిని అలరించిన విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.వి.వి. సత్యనారాయణ, వైస్-ప్రిన్సిపాల్ ఎం.ఎస్.ఎల్. శైలజ మరియు అతిధుల చేతుల మీదుగా బహుమతులు అందజేసి విద్యార్థి దశ విలువలను తెలిపారు.ఈ కార్యక్రమములో పాఠశాల వైస్ ప్రిన్సి పాల్ ఎం.ఎస్.ఎల్. శైలజ, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యా ర్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**చోడవరంలో మనబడి నాడు-నేడు కార్యక్రమంలో ఎమ్మెల్యే - కరణం ధర్మశ్రీ**



**సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ**

చోడవరం : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ వారికి అవసరమైన మౌళిక వసతులు కల్పించడంతో పాటు, నాణ్యమైన ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరం పట్టణంలోని కొత్తూరు జంక్షన్‌లో గల బాలికోన్నత పాఠశాల ఆవరణ గురువారం నాడు-నేడు కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయె రోజులలో విద్యార్థుల భవిష్యత్తు అవసరాల దృష్ట్యా విద్యాబోధన జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని, విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.డీవో దుర్గా శ్యామ్ సుందర్, ఈవోపిఆర్.డి, చైతన్య, ఎం.ఈవో, పి.అచ్చుతరావు, జి.జె.సుందర్ సింగ్, డి.కృష్ణ కుమారి, కె.వి.ఎం.నాయుడు, బి.ఏ.రాజు, వై.సిపీ మండల అధ్యక్షులు పల్లా నరసింగరావు, టౌన్ అధ్యక్షులు పుల్లేటి వెంకటరావు, మహిళా విభాగం టౌన్ అధ్యక్షురాలు అల్లాడ భవానీ, ఓరుగంటి నెహ్రు, బొడ్డేడ సూర్యనారాయణ,సూరిశెట్టి నాగదుర్గ గోవింద,వెంపలి ఆనందేశ్వరరావు, ఉప్పల బాబు, వి.ప్రకాష్,బొగ్గ శ్యామల, దొండా రాంబాబు, వై.సిపీ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్దినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్పీల వేతనం పెంచినందుకు హర్షం



భీమునిపట్నం: ఆర్పీల వేతనం పెంచినందుకు స్థానిక పాత బస్సు స్టాండ వద్ద ఉన్న రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్పీలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజాసంకల్ప యాత్ర లో భాగంగా ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారనీ హర్షం వ్యక్తం చేశారు. ఆర్పీలకు గౌరవవేతనం మూడువేల రూపాయలు నుండి పది వేల రూపాయలు పెంచిమాట నిలబెట్టుకున్నారనీ తెలిపారు. ఈ కారణంగా రాష్ట్రంలో ప్రతీ ఇంట్లో పండగ వాతావరణం నెలకొనిఉందనీ అన్నారు. ఈ సందర్భంగా వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ఫొటోకి పాలాభిషేకం చేసారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టిపిఆర్‌ఓ.శ్రీనివాస్, భీమిలి, ఆర్పీలు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సత్యదేవుని హుండీల లెక్కింపు ఆదాయం 15 రోజులకు రూ.1.9 కోట్లు



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం తాలూకా హుండీల లెక్కింపు గురువారం నిర్వహించారు. గడచిన 15 రోజులకు గాను సత్యదేవుని హుండీల ఆదాయం రూ.1,08,96, 596/-(ఒక కోటి, ఎనిమిది లక్షల,తొంభై ఆరు వేల,ఐదు వందల తొంభై ఆరు రూపాయలు) రాగా బంగారం 495 గ్రాములు, వెండి 485 గ్రాములు,యుయస్ఏ కరెన్సీ 21 డాలర్లు, ఆస్ట్రేలియా 30 డాలర్లు,సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఓమెన్ 200 బేస్ మరియు ఇతర విదేశీ ద్రవ్యముతో పాటు రద్దయిన పాత కరెన్సీ రూ.10,000/- లభ్య మయ్యాయి. ఈ హుండీల లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం ఈవో వి.త్రినాధరావు, ఏసి రమేష్ బాబు, చైర్మెన్ ఐ.వి.రోహిత్, ఏఈవో ప్రసాద్ మరియు దేవస్థానం అధికారులు, సిబ్బంది, వ్రత పురోహితులు, అర్చకులు, నాయీ బ్రాహ్మణులు,శ్రీహరి సేవా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# దీవిస్ లాబరేటరీస్ విద్యార్థులకు ప్రోత్సహకాలు , సర్టిఫికేట్లు అందజేత

భీమునిపట్నం : బాలల దినోత్సవం సందర్భంగా చిప్పడ దీవిస్ లాబరేటరీస్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో మట్టి వినాయక విగ్రహాలు తయారు చేసిన విద్యార్థులు ప్రోత్సహం కోసం మనిషికి ఐదు వందలు చొప్పున అందజేసారు. మొదటి స్థానం వచ్చిన వారికి మూడువేలు, రెండవ స్థానం వచ్చిన వారికి రెండు వేలు, మూడవ స్థానం వచ్చిన వారికీ వెయ్యి రూపాయలుతో సర్టిఫికెట్స్‌లను దివీస్ ప్రతినిధి ఈ.ఎస్.నాగరాజు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో దీవిస్ ప్రతినిధులు ఫణికుమార్ వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



## లారీ ఢీ : మహిళ దుర్మరణం

ఎస్.రాయవరం : లారీ ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన ఎస్.రాయవరం మండలం, డి.అగ్రహారం జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసు కథనం ప్రకారం ఈ గ్రామానికి చెందిన వెదుళ్ల నాగమణి (44) ఉదయం మరో మహిళతో కలిసి పెనుగొల్లు శివాలయానికి వెళ్ళింది. అక్కడ దైవ దర్శనం చేసుకుని తిరిగి ఇంటికి వెళ్లేందుకు వంతెనపై నడుస్తున్న సమయంలో ముందు వెళ్తున్న లారీ దాటే ప్రయత్నంలో మరో లారీ రోడ్డుపై నడుస్తున్న నాగమణిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె పై నుంచి లారీ చక్రాలు వెళ్ళిపోవడంతో శరీరం నుజ్జునుజ్జు అయింది. అక్కడికక్కడే ఆమె మృతి చెందింది. లారీ డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోవడంతో విషయం తెలుసుకున్న హెచ్‌సి రామకృష్ణ సిబ్బందితో లారీని వెంబడించి పురుషోత్తపురం వద్ద పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టంనకు తరలించారు. నాగమణి మృతదేహాన్ని చూసిన బంధువులు, స్థానికులు కన్నీరు మున్నీరయ్యారు.

## ప్రభుత్వానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలి

**ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ**

చీడికాడ : అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించే బాధ్యత అధికారులదేనని ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో వున్న సమస్యలను గుర్తించారు. పరిష్కారానికి తీసుకోవల్సిన సమస్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకాలు సమర్ధవంతంగా అమలు చేసి ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలని, ముఖ్యమంత్రికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని అధికారులను కోరారు.

# దేశ వ్యాప్తంగా 50 కేంద్రాలలో గీతం ప్రవేశ పరీక్ష




విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి పట్టణాల్లో తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ లోనూ, కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో ఆన్‌లైన్ విధానంలో 2020 మే నెల రెండవ వారంలో అడ్మిషన్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

**ప్రతిభ గల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు:**

ఈ ఏడాది నుంచి ప్రతిభగల విద్యార్థులను పెద్దఎత్తున ప్రోత్సహించడానికి రూ.30 కోట్ల రూపాయల మేరకు విద్యార్థులకు ప్రతిభ స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నట్లు వైస్ ఛాన్స్‌లర్ ప్రకటించారు.

గీతం ప్రవేశ పరీక్షలో మొదటి 50 ర్యాంకర్లకు ఉచిత విద్య అందిస్తామని, 51 నుంచి 250 ర్యాంకు వరకు సాధించిన విద్యార్థులకు ఫీజులో 75 శాతం రాయితీ, 251 నుంచి 1000 ర్యాంకు వరకు సాధించిన విద్యార్థులకు ఫీజులో 50 శాతం రాయితీ, 1001 నుంచి 3000 ర్యాంక్ వరకు సాధించిన విద్యార్థులకు ఫీజులో 25 శాతం రాయితీ ఉంటుందని వైస్-ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ వెల్లడించారు.

జేఈఈ మెయిన్ జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలో మొదటి 500 ర్యాంకర్లకు ఉచిత విద్య అందిస్తామని, 501 నుంచి 5000 ర్యాంకు వరకు సాధించిన విద్యార్థులకు ఫీజులో 75 శాతం రాయితీ ఉంటుందని, 5001 నుంచి 10000 ర్యాంకు వరకు సాధించిన విద్యార్థులకు ఫీజులో 50 శాతం రాయితీ ఉంటుందని, 10001 ర్యాంకు నుంచి 1,00,000 ర్యాంకు వరకు సాధించిన విద్యార్థులకు ఫీజులో 25 శాతం రాయితీ ఉంటుందని వైస్-ఛాన్స్‌లర్ వెల్లడించారు.

ఎపి ఎంసెట్, తెలంగాణ ఎంసెట్ ప్రవేశ పరీక్షలలో మొదటి 250 ర్యాంకర్లకు ఉచిత విద్య అందిస్తామని, 251 నుంచి 1000 ర్యాంకు వరకు సాధించిన విద్యార్థులకు ఫీజులో 75 శాతం రాయితీ ఉంటుందని,1001 నుంచి 5000 ర్యాంకు వరకు సాధించిన విద్యార్థులకు ఫీజులో 50 శాతం రాయితీ ఉంటుందని, 5001 నుంచి 25,000 ర్యాంకు వరకు సాధించిన విద్యార్థులకు ఫీజులో 25 శాతం రాయితీ ఉంటుందని వైస్-ఛాన్స్‌లర్ తెలిపారు.

కర్ణాటక విద్యార్థులకు 25 శాతం సీట్లు బెంగళూరు కేంపస్‌లో కెసెట్, కామెడ్‌కె లలో కనబరిచిన ప్రతిభ ఆదారంగా భర్తి చేస్తామన్నారు.

గీతం ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్ కోర్సులలో ప్రవేశం పొందిన విద్యార్థులలో ప్రతిభ గలవారిని మొదటి సెమిస్టర్ మార్కుల ఆధారంగా ఎంపిక చేసి వారికి మెరిట్ కమ్ మీన్స్ స్కాలర్‌షిప్‌ను అందజేస్తామని, ఎమ్‌టెక్ చదువుతున్న విద్యార్థులకు మొదటి సంవత్సరం స్కాలర్‌షిప్‌లను, రెండవ సంవత్సరం టీచింగ్ అసిస్టెంట్‌షిప్ లను ప్రతిభ ఆధారంగా అందజేస్తామన్నారు. బి.ఫార్మశీ, ఎమ్.ఫార్మశీ విద్యార్థులకు ప్రతిభ స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్నట్లు వైస్-ఛాన్స్‌లర్ తెలిపారు.

విలేకరుల సమావేశంలో అడ్మిషన్ల డైరక్టర్ ప్రొఫెసర్ కె.నరేంద్ర, ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.ధర్మరాజు, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మశీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.గణపతి, స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డైరక్టర్ ప్రొఫెసర్ మోహన్, అడ్మిషన్ల విభాగం డిప్యూటి డైరక్టర్ డాక్టర్ వెంకటరమణ, సహాయ అసిస్టెంట్ డైరక్టర్లు జగదీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

విస్తృతం అవుతాయన్నారు. ఎమ్‌టెక్‌లో కొత్తగా కంప్యూటర్ ఎయిడెడ్ స్ట్రక్చరల్ ఎనాలిసిస్ అండ్ డిజైన్ కోర్సును, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విత్ డేటా సైన్సెస్ కోర్సును, మెకానికల్ ఇంజనీరింగ్ విత్ కంప్యూటర్ ఎయిడెడ్ ఇంజనీరింగ్ కోర్సును, మ్యాన్‌ఫ్యాక్చరింగ్ టెక్నాలజీ అండ్ ఆటోమేషన్ కోర్సును ఈ ఏడాది నుంచి గీతం హైదరాబాద్ ప్రాంగణంలో ప్రారంభిస్తున్నామని తెలిపారు. అలాగే విశాఖ ప్రాంగణంలో కొత్తగా ఎమ్‌టెక్‌లో బయోమెడికల్ సిగ్నల్ ప్రాసెసింగ్ అండ్ ఇనుస్ట్రుమెంటేషన్, మ్యాన్‌ఫ్యాక్చరింగ్ టెక్నాలజీ అండ్ ఆటోమేషన్ కోర్సులను ప్రారంభిస్తున్నామని వైస్ ఛాన్స్‌లర్ తెలిపారు.

ఈ కోర్సులలో ప్రవేశాలకు గ్యాట్-2020 రాయవలసి ఉంటుందన్నారు. గ్యాట్-2020 ప్రవేశ పరీక్షకు సంభందించిన ధరఖాస్తులు దేశ వ్యాప్తంగా అన్ని యూనియన్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, కరూర్ వైశ్యా బ్యాంక్ శాఖలలో లభిస్తాయని వైస్-ఛాన్స్‌లర్ పేర్కొన్నారు. గీతం ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో www.gitam.edu ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. పూర్తి చేసిన ధరఖాస్తులను 2020వ సంవత్సరం మార్చి 30వ తేది లోగా అందజేయవలసి ఉంటుందన్నారు. ఏప్రియల్ 5వ తేది నుంచి గీతం వెబ్‌సైట్ లో హాల్ టికెట్లను డౌన్ లోడ్ చేసుకోవచ్చునని పేర్కొన్నారు.

ఏప్రియల్ 11వ తేది నుంచి 21వ తేది వరకు ఈ ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. ఆన్‌లైన్ విధానంలో గత 12 సంవత్సరాలుగా ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్న ఘనత గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానిదేనని తెలిపారు. ప్రవేశ పరీక్ష పూర్తి అయిన నాలుగు రోజులలో అంటే ఏప్రియల్ 25 వ తేదిన ఫలితాలను వెల్లడిస్తామని వైస్-చాన్స్‌లర్ తెలిపారు.

**గ్యాట్-2020 పరీక్షా విధానం:**

రెండు గంటల కాలవ్యవది గల గ్యాట్ -2020 ప్రవేశ పరీక్షలో మొత్తం 100 ఆబ్జెక్టివ్ మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలకు విద్యార్థులు సమాధానాలు గుర్తించవలసి ఉంటుందని, గణితంలో 40 ప్రశ్నలు, భౌతిక శాస్త్రంలో 30 ప్రశ్నలు, రసాయనిక శాస్త్రంలో 30 ప్రశ్నలు ఉంటాయని, ప్రతి ప్రశ్నకు 2 మార్కులు ఉంటాయని వైస్-చాన్స్‌లర్ తెలిపారు.దీనికి సంబంధించిన సిలబస్ కోసం గీతం వెబ్ సైట్‌ను పరిశీలించాల్సిందిగా ఆయన సూచించారు.

గీతం ప్రవేశపరీక్షలో విద్యార్థులకు లభించిన ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్లు ఉంటాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో

# నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసిన వైయస్ఆర్ స్టూడెంట్ యూనియన్




విశాఖపట్నం : మొట్టమొదటి భారత ప్రధాని. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకొని నవంబర్ 14న బాలల దినోత్సవం జరుపుకుంటారు. దానిలో భాగంగా వై.యస్.ఆర్.స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో ఆంధ్రా యూనివర్శిటీ మెయిన్‌గేట్ వద్ద నెహ్రూ చిత్ర పటానికి పూలదండ వేయటం జరిగింది. అనంతరం విద్యార్థి నాయకులు మాట్లాడుతూ జవహర్‌లాల్ నెహ్రూ భావితరాల కోసం, విద్యార్థుల భవిష్యత్ కోసం పునాదులు వేశారు. పిల్లలు అంటే చాలా ఇష్టం. దానిలో భాగంగా నెహ్రూ పుట్టిన రోజున బాలల దినోత్సవం జరుపుకుంటారు. నెహ్రూ కన్న కలలు ఈ దేశంలో నిజంగా సాకారం చేసిన వ్యక్తి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ వై.యస్.జగన్ మోహన్ రెడ్డి గారు. దానిలో భాగమే బాలల దినోత్సవం సందర్భంగా నాడు-నేడు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి ప్రాథమిక విద్యలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి 12 వేల కోట్ల రూపాయలు కేటాయించటం జరిగింది. నాడు-నేడు పథకం ద్వారా స్మార్ట్‌క్లాస్, మంచినీరు, మరుగుదొడ్లు, మంచి క్లాస్ రూమ్ వాతావరణం, ఆధునికమైన బ్లాక్‌బోర్డ్స్ 9 రకాల సేవలను, చేపట్టడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు శ్రీ వై.యస్.జగన్‌మోహన్ రెడ్డి గారు నేటి బాలలే రేపటి పౌరులు అని నినాదాలతో ముగించారు.

ఈ కార్యక్రమంలో ప్రొ॥ప్రేమానంద రం, విద్యార్థి విభాగం విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు బి.కాంతా రావు, వై.యస్.ఆర్. విద్యార్థి ఏ.యూ.అధ్యక్షులు బి.మోహన్‌బాబు, రాష్ట్ర కార్యదర్శులు ఎమ్.కళ్యాణ్, కుమారస్వామి, సురేష్, జోగారావు, విద్యార్థి నాయకులు: సిహెచ్.క్రాంతికిరణ్, సాయికృష్ణ, రంజిత్,పవన్, సంజయ్, రాజేష్, వెంకటేష్, శివ, తరుణ్, చైతన్య, ఆశీష్, వృద్ధి, వెంకటేష్, చిన్నబాబు, త్రినాధ్ మరియు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# నో ర్యాగింగ్ షార్ట్ ఫిల్మ్ పోస్టర్ విడుదల



విశాఖపట్నం : సనరా ఫీనిక్స్ మూవీస్ బ్యానర్ పై శరత్ చంద్ర నిర్మాత గా సత్యాడ నరసింగరావు దర్శకత్వంలో రూపొందించిన నో ర్యాగింగ్ షార్ట్ ఫిల్మ్ పోస్టర్ ను ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య వి.వి.జి.డి.ప్రసాద్‌రెడ్డి ఆయన ఛాంబర్ లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజికాంశాలను ఇతి వృత్తంగా చేసుకుని షార్ట్ ఫిలిమ్స్ రూపొందిస్తున్న దర్శకుడు సత్యాడ నరసింగరావు కు అభినందనలు తెలియజేశారు. నేడు ర్యాగింగ్ కాన్సెప్ట్ పై కూడా షార్ట్ ఫిల్మ్ రూపొందించారని పేర్కొన్నారు.మంచి కాన్సెప్ట్ లతో మరిన్ని మంచి ఫిలిమ్స్ తీయాలని అభిలాషించారు. షార్ట్ ఫిలిమ్స్ మేకర్స్ అందరూ ప్రజలను చైతన్య పరిచే షార్ట్ ఫిలిమ్స్ ని తీయాలని కోరారు.

దర్శకుడు సత్యాడ నరసింగరావు మాట్లాడుతూ పదినిమిషాల నిడివిలో ఈ షార్ట్ ఫిల్మ్ ను రూపొందిం చడం జరిగిందన్నారు. ఇప్పటివరకు తమ టీమ్ సుమారు 15 షార్ట్ ఫిలిమ్స్ తీయడం జరిగిందని చెప్పారు. నో ర్యాగింగ్ షార్ట్ ఫిల్మ్ ను త్వరలోనే విడుదల చేస్తున్నట్లు చెప్పారు. అలాగే జస్టిస్ పేరుతో త్వరలో మరో షార్ట్ ఫిల్మ్ ని నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నిర్మాత, రాస్ టెక్నాలజీస్ అధినేత శరత్ చంద్ర మాట్లాడుతూ మంచి కాన్సెప్ట్ లతో తమ టీమ్ షార్ట్ ఫిలిమ్ లను నిర్మిస్తుందని తెలిపారు. తమకు అన్ని విధాలా సహకరిస్తున్న మిత్రులందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రి డిస్కవర్ అడ్వ టైజింగ్ అండ్ టూరిజం ప్రమోటర్స్ మేనేజింగ్ డైరెక్టర్ మహేష్ జొన్నాడ, సీ.ఈ.ఓ అమిత్ ఏ.కే, శశి,హర్ష, యస్వంత్, రాస్ టెక్నాలజీస్ సిబ్బంది, డిస్కవర్ అడ్వ టైజింగ్ అండ్ టూరిజం ప్రమోటర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు న్యాయ విజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలి

**చోడవరం కోర్టు సీనియర్ సవిల్ జడ్జి పి.ఆర్.రాజీవ్**




న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న చోడవరం కోర్టు సీనియర్ సివిల్ జడ్జి పి.ఆర్.రాజీవ్

చోడవరం : సమాజంలోని ప్రతి ఒక్కరు న్యాయ విజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని చోడవరం కోర్టు సీనియర్ సివిల్ జడ్జి,న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ పి.ఆర్.రాజీవ్ అన్నారు. పట్టణం లోని ఉషోదయ విద్యా సంస్థ సమావేశ మందిరంలో గురువారం న్యాయ విజ్ఞానంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాం గంలో రూపొం దించిన పలు అంశాలపై వివరించారు. ముఖ్యంగా సమాజంలో మంచి చెడులు, వాటి ప్రభావం, నిర్భయ చట్టం, సమాచార హక్కు చట్టం, విద్యాహక్కు చట్టం, ర్యాగింగ్ తదితర వాటిపై వివరించి వాటి పర్య వసానాలపై ఉదాహరణలతో వివరిం చారు. విద్యార్థులు చెడు వ్యసనా లకు లోను కాకుండా ఉన్నతులుగా ఎదిగి సమాజ, దేశ శ్రేయ స్సుకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ విద్యా సంస్థల ఛైర్మన్ జెర్రిపోతుల రమణాజీ, డీన్ వెంకట వాసు, ఎంఈడీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వి.ఎస్.ఎన్.మూర్తి,జూనియర్, డిగ్రీ, బిఈడీ కళాశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ పోర్టు ట్రస్టు ఆధ్వర్యంలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు




విశాఖపట్నం : విశాఖపట్నం పోర్టు ట్రస్టు ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పోర్టు డిప్యూటీ చైర్మన్ శ్రీ పిఎల్ హరనాధ్ పాల్గొన్నారు. గౌరవ అతిధిగా పోర్టు మహిళా సమాజం ఉపాధ్యక్షురాలు శ్రీమతి గిరిజా సుందరి పాల్గొన్నారు. ఏటా నవంబర్ 14న బాలల దినోత్సవాన్ని పోర్టు అధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా పోర్టు క్రికెట్ గ్రౌండ్ లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని గడిచిన వారం రోజులుగా పోర్టు హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు పలు అంశాలలో పోటీలు నిర్వహించారు. పోర్టు క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ పోటీలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పోర్టు డిప్యూటీ చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఏదో ఒక క్రీడను ఎంపిక చేసుకోవాలని సూచించారు. నేటి పోటీ ప్రపంచంలో ఒత్తిడి ఎక్కువైందని ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని అన్నారు. క్రీడల ద్వారా మానసిక వికాసం పొందుతారని ఆయన అన్నారు. పోర్టులో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విజేతలకు పోర్టు మహిళా సమాజం ఉపాధ్యక్షురాలు శ్రీమతి గిరిజా సుందరి, డిప్యూటీ చైర్మన్ శ్రీ పిఎల్ హరనాధ్ లు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పోర్టు ఫైనాన్షియల్ అడ్వైజర్ శ్రీ శివకుమార్, పోర్టు స్టేడియం ఇంచార్జ్ నాగభూషణం, సీనియర్ పీఓ సాంబమూర్తి, క్రీడాధికారి శ్రీధర్ బాబులు పాల్గొన్నారు. పోర్టు హైస్కూల్ విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు కార్పోరేషన్ రుణాలు అందించాలి



అచ్యుతాపురం : దివ్యాంగులకు ప్రభుత్వం కార్పోరేషన్ రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని శ్రీ స్వామి వివేకానంద వికలాంగుల అసోసియేషన్ అధ్యక్షుడు మేరుగు నూకరాజు కోరారు. గురువారం ఆయన దివ్యాంగుల సమస్యల పై సంఘ సభ్యులుతో కలిసి జిల్లా వికలాంగుల ఏ డి కోటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. రుణాలు కోసం బ్యాంకులు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కావున ప్రభుత్వం దివ్యాంగులకు నేరుగా రుణాలు అందించేలా చర్యలు తీసు కోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిన్న, యజ్జల అప్పలరాజు, పొన్నమల్ల ప్రకాష్, ఎరిపల్లి కోదండమ్మ తది తరులు పాల్గొన్నారు.

# ఛాయిస్ ఎలివేటర్స్ షోరూమ్ ప్రారంభం



ఛాయిస్ ఎలివేటర్స్ షోరూమ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే గణబాబు

కంచరపాలెం: స్థానిక జీవీఎంసీ 42 వార్డ్ గౌరీనగర్ వద్ద ఎన్ ఏ డీ కొత్తరోడ్డు వద్ద గురువారం చాయిస్ ఎలివేటర్స్ షోరూమ్ ను పశ్చిమ నియోజక టీడీపీ ఎమ్మెల్యే పి.గణబాబు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. తొలుతగా జ్యోతి ప్రజలన అనంతరము షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నిర్మాణ రంగంలో ప్రతి ఒక్క బిల్డింగ్ కు ఎలివేటర్స్ ఎస్కలేటర్స్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. తదనంతరం మేనేజింగ్ డైరెక్టర్ షేక్ అబ్దుల్ బషీర్ మాట్లాడారు. కంపెనీ ప్రొఫైల్ ఛాయిస్ ఎలివేటర్స్, ఎస్కలేటర్స్ రంగంలో నాణ్యమైన సేవలను అందించే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బాగా స్థిరపడ అత్యాధునిక ఎలివేటర్ వ్యవస్థలను అందించడానికి కట్టుబడి ఉన్నామని, మా బ్రాండెడ్ ఎలివేటర్లు మరియు ఎస్కలేటర్లను ఉపయోగిస్తున్న కస్టమర్ల కోసం ఉత్తమ మైన వాటిని సాధించడమే మా లక్ష్యంగా భావిస్తున్నాయని, మా ఉత్పత్తులు అధిక నాణ్యత కలిగినవి మరియు ఇండి యన్ స్టాండర్డ్స్ ఛాయిస్ ఎలివేటర్ క్రింద తయారు చేయ బడ్డాయి, మా విలువైన కస్టమర్లకు ఉత్తమ సేవలను అందించడానికి మాకు చాలా అనుభవజ్ఞులైన ఇన్స్టా లేషన్ ఇంజనీర్లు మరియు ఇన్స్టాలేషన్ మరియు మెయింటెనెన్స్ టెక్నీషియన్లు ఉన్నారు మరియు సంవత్స రానికి 24 గంటలు రౌండ్ బ్యాక్ సౌకర్యాలు మా ప్రత్యేకతలు డెలివరీ మరియు తక్కువ వ్యవధిలో సంస్థాపన పెద్ద రకాల అంతర్గత అలం కరణలు చాలా పోటీ ధర. మేము మా ఆవర్తన నిర్వహణకు ప్రత్యేక ప్రాధా న్యత ఇస్తామన్నారు.

ఈ సందర్భముగా ఎంఎల్ఏ చేతులమీదుగా క్యాబిన్ ఇంటీరియర్ డెకరేషన్ మెటీ రియల్స్, కేటలాగ్స్ మరియు వివిధ డిజైన్ల ఫోటోల నమూనాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమములో 67వవార్డ్ టీడీపీ అధ్యక్షుడు నమ్మి శ్రీను, కార్యదర్శి కె.కె.రావు, నగర టీడీపీ కార్యదర్శి వెంకు మహంతి చంద్రశేఖర్, శరత్ చంద్రన్‌బాబు, రెడ్డి వేణుగోపాల్, మూర్తి, హరి, అశోక్‌కృష్ణ, అధిక సంఖ్యలో నిర్వాహకులు మహిళలు పాల్గొన్నారు.

# బాలలు దేశానికి స్ఫూర్తిగా ఎదగాలి



మధురవాడ, నేటి బాలలు దేశానికి స్ఫూర్తిగా ఎదగాలని, అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిఎంపాలెం సిఐ ఏ.రవికుమార్ ఆశాభావం వ్యక్తం చేసారు.

బాలల దినోత్సవం సందర్భంగా చంద్రంపాలెం జడ్.పి. హైస్కూల్ లో మధురవాడ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతీ ప్రధాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకొని,ప్రతీ ఒక్కరూ దేశానికి సేవ చేసే పౌరులుగా ఎదగాలన్నారు. పాఠశాలలో ఉన్నప్పుడు ఎంత క్రమశిక్షణగాను,మంచి ఆలోచనలతో మెలుగుతున్నారు. పాఠశాల బయట కూడా అదే పద్ధతిగా నడిచి మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. పాఠశాల హెడ్మాస్టర్ రాజబాబు మాట్లాడుతూ భారతదేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ కి పిల్లలంటే చాలా ఇష్టమని,ఆయనను ఆదర్శంగా తీసుకొని భవిష్యత్ తరాలకు బాటవేసే విధంగా విద్యార్థులు చదువుల్లో రాణించాలని కోరారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు గౌరవ అతిధుల చేతుల మీదుగా నగదు పురస్కారాలు, డిక్షనరీలులతో పాటు మెడల్స్ అందజేశారు, అంతేకాకుండా క్రీడల్లో ప్రతిభకనపర్చిన వారికి స్పోర్ట్స్ ట్రాక్ షుట్స్ అందజేశారు, అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ నమ్మి అప్పలరాజు, అధ్యక్షులు నక్కా శ్రీధర్, కార్యదర్శులు కానూరి అచ్యుత్ రావు, కోనేటి దేవరాజు, ఉపాధ్యక్షులు బంగారు అశోక్ కుమార్, పోతిన శివ, లోడగల అప్పలరాజు, సహకార్యదర్శి నాగోతి సత్యన్నారాయణ, కార్యవర్గ సభ్యులు పోలిమాటి సునీల్ కుమార్, దుర్గారావు, రమేష్, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

# వైశాఖి స్పోర్ట్స్ పార్క్‌లో ఘనంగా బాలల దినోత్సవం

**- అలరించిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు - నైపుణ్యత కొరకు ఇంగ్లీషు తప్పనిసరి : వీ-టీమ్ వీరుమామ**





మురళీనగర్ : షైనింగ్ స్టార్స్ డాన్స్ అకాడమీ వారి ఆధ్వర్యంలో స్థానిక వైశాఖి స్పోర్ట్స్ పార్క్‌లో వేములాపల్లి కళాక్షేత్రంలో అంతర్జాతీయ బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ప్రముఖ వ్యాఖ్యాత వీ-టీమ్ వీరుమామ హాజరయి ప్రారంభించారు.

ఈ సందర్భంగా వీరుమామ మాట్లాడుతూ నేటి టెక్నాలజీ యుగంలో విద్యార్థులు తమ మాతృభాషను గౌరవిస్తూ ఇంగ్లీషును కూడా పూర్తిస్థాయిలో నేర్చుకోవాలని, విద్యార్థులు అన్ని రంగాలలో పైచదువలకు, డెవలప్‌మెంట్ స్కిల్స్, ఇతర దేశాలలో వారి వారి రంగాలలో అభివృద్ధి చెందాలంటే ప్రపంచ దేశాలకు పోటీగా ఇంగ్లీషును ప్రతీ ఒక్కరూ నేర్చుకోవాలని వీరుమామ పిలుపునిచ్చారు. చాచా నెహ్రూ ఆశయాలకు అనుగుణంగా బాలలంతా తీర్చిదిద్దాలని అన్నారు. చిన్నారులు వివిధ సినీ పాటలకు నృత్యాలను చేసి ఆహూతులను అలరించారు. ఈ కార్యక్రమంలో సినీ నటి (రొమాంటిక్ హీరోయిన్) ననపల మౌనిక హాజరై చిన్నారులలో మరింత ఉత్సాహాన్ని రేకెత్తించారు.. అనంతరం మౌనికను సన్మానించారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా ప్రముఖ యాంకర్ మమత, నంది అవార్డు గ్రహీత కారెం వినయ్ ప్రకాష్, షైనింగ్ స్టార్స్ డాన్సింగ్ అకాడమీ ట్రైనర్ ప్రశాంతి, వైశాఖి స్పోర్ట్స్ పార్క్ ప్రెసిడెంట్ నారాయణరావు, సెక్రటరీ సూర్యనారాయణ, కార్యవర్గ సభ్యులు కూర్మారావు, వి.కె. పటేల్ మరియు వనితా వాకర్స్ అధ్యక్షురాలు ఉమాదేవి, మరియు స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పంచాయితీ అభివృద్ధి ప్రణాళికలపై గ్రామ సభలు



అచ్యుతాపురం: మండలంలో పలు పంచాయితీలలో మిషన్ అంత్యోదయ సర్వే మేరకు గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళి కలపై అధికారులు గురువారం గ్రామ సభలు ఏర్పాటు చేశారు .ఈ సందర్భంగా పూడిమడక గ్రామ సభలో ప్రత్యేకాధికారి మహేష్ మాట్లాడుతూ గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళికలు సమగ్రంగా రూపొందించాలన్నారు. ప్రధానంగా మురుగునీటి కాలువలు, త్రాగు నీటి సమస్య వంటి మౌళిక వసతులపై ప్రణాళి కలు నివేదికలు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వాసుపల్లి శ్రీనివాసరావు, చేపల వెంకటరమణ, పంచాయితీ కార్యదర్శి కె వి శ్రీనివాసరావు ,సూరాడ ధనరాజు, మేరుగు చిన్న , సచివాలయ సిబ్బంది , వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ లో మిస్ దివా 2020 ఆడిషన్స్

హైదరాబాద్ : మిస్ యూనివర్స్ ఇండియా 2020 విజేత ఎవరు? ఏ నగరానికి చెందిన అందగత్తె ఈ కిరీటాన్ని దక్కించుకోబోతున్నారు? ప్రస్తుతానికి సస్పెన్స్. ప్రతియేటా మిస్ దివా ఉత్సవాలు ఎంత వైభవంగా జరుగుతున్నాయో చూస్తున్నదే. ఈ ఏడాది కూడా ఈ సెలక్షన్స్ జరగనున్నాయి. లివా మిస్ దివా 2020 ఆడిషన్స్ ని నిర్వహించేందుకు ప్రఖ్యాత సంస్థ రెడీ అవుతోంది. 11 నగరాల్లో ఆడిషన్స్ నిర్వహించనున్నరు. 4 ప్రిలిమినరీ మీడియా టూర్లు జరగనున్నాయి. ఇంతకుముందు లక్నో నగరంలో ఆడిషన్స్ జరిగాయి. ఈనెల (నవంబర్) 17న హైదరాబాద్ లో ఆడిషన్స్ జరగనున్నాయి. ఈ ఆదివారం హైదరాబాద్ గచ్చిబౌళిలోని హయత్ లో ఈ ఆడిషన్స్ ని నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. వెన్యూ: రోడ్ నం.2, ప్లాట్ నం.7, ఐటీ పార్క్, గచ్చిబౌళి.. ని ఫిక్స్ చేశారు. ఇతర వివరాలకు మిస్ దివాఆర్గనైజేషన్ జీమెయిల్ కి సంప్రదించగలరు.



**ఉత్తర నియోజకవర్గం ఇంచార్జి అయినా కే కే రాజుని వైయస్సార్ పార్టీ నాయకులు .23.వార్డు దళిత నాయకుడు కొప్పుల వెంకట్ రావు 37 వ వార్డు ఎస్సి సెల్ నాయకుడు దొండపర్తి లక్ష్మణ్ రావు, ఎ. వెంకటరమణ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెంగల చిన్నారావు.. అలజంగి భాను ప్రకాష్.. ఎ. విజయ్ కుమార్ ..గణపతి గోపి ..కేకే రాజుగారు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు.**

## ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

అన్నవరం: తూ.గో.జిల్లా అన్నవరం స్దానిక రైల్వే స్టేషన్ రోడ్డు నందు ఉన్న శ్రీ శారదా విద్యాలయంలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా స్దానిక ఎస్సై రావూరి.మురళీమోహన్ విచ్చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు అందరూ విద్యను ఇష్టపడి చదవాలని,ఇష్టంతో కూడిన పని ఏదైనా ఫలితాన్ని ఇస్తుందని తద్వారా తాను అనుకున్న పని ఏదైనా సాధించవచ్చు అని తెలిపారు.అదేవిధంగా స్కూల్ కరస్పాండెంట్ కృష్ణ వర్మ మాట్లాడుతూ పిల్లలు అందరూ క్రమ శిక్షణతో కలిగిన మంచి విలువలతో నడుచు కోవాలని సూచించారు.అనంతరం ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేసారు.

# వాటర్ ట్యాంక్‌లో పసికందు మృతదేహం



మధురవాడ, ఏ కర్కశ తల్లికి బరువు అయ్యాడో లేక కసాయి కుటుంబానికి భారం అయ్యాడో తెలియదు గాని నీళ్ల కుండీలో అనుమానాస్పద స్థితిలో శవమై తేలాడు ఓ పసికందు, కలకలం రేపిన ఈ విషాద సంఘటన మహా విశాఖ ఐదవ వార్డు పరిధి మారికవలస రాజీవ్ గృహకల్ప కాలనీ బ్లాక్ నెంబర్ 141 లో చోటు చేసుకుంది. దీంతో జరిగిన సంఘటన పోలీసులకు తెలియడంతో సంఘటన స్థలానిక చేరుకున్న పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ.హా.రవికుమార్, పసికందు మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. శిశువు మృతదేహాన్ని పోస్టుమార్టం రిపోర్టు నిమ్మితం కేజీహెచ్కు తరలించారు, పీఎం పాలెం పోలీసుల తెలిపిన వివరాల మేరకు సుమారు పది రోజుల వయస్సు గుర్తుతెలియని పసికందు మృతదేహం గుర్తు తెలియని వ్యక్తులు నీళ్ల కుండీలో పడేసి వెళ్లిపోయే ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేశారు మరిన్ని వివరాలు తెలుసుకునేందుకు దర్యాప్తు చేస్తున్నామని సిఐ తెలిపారు.

## ప్రతిపక్షనాయకులు వైకాపా ప్రభుత్వంపై కుట్రలు పన్నుతున్నారు



గాజువాక: ఏపీలో వైకాపా ప్రభుత్వం పై ప్రతిపక్షనేతలు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌లు కుట్రలు పన్నుతున్నారని, రాష్ట్రప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని గాజువాక ఎమ్మెల్యే తిప్పలనాగిరెడ్డి మండి పడ్డారు. గురువారం గాజువాక పార్టీకార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇసుక విధానంతో రాష్ట్ర ప్రజలకు ఎంతో ఉపయోగం ఉందని, ప్రస్తుతం ఇసుక అన్ని ప్రాంతాల్లోని యార్డులలో అందుబాటులోనికి తీసుకురావడం జరిగిందని అన్నారు. ఇసుక వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 14వ తేదీనుంచి 21వ తేదీ వరకు ప్రతీ వార్డుల్లో కూడ ప్రజలకు తెలియజేసే విధంగా కార్యక్రమాలను చేపట్టాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేసారని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ ప్రజారంజకపాలనను సాగిస్తున్న, ఇసుకపై ప్రతిపక్షాలు రాద్ధాంతం చేయడం దారుణమని అన్నారు.

ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు పల్లాచిన్నతల్లి, రెడ్డి జగన్నాధం, నక్కరమణ, రాజాన రామారావు, శ్రీనివాస్ కటికల కల్పన తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు ఆరోపణలపై ప్రతిపక్షాలకు ప్రజలే బుద్ధి చెబుతారు



సింధియా/ములగాడ: వైకాపా ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న ప్రతిపక్షాలకు ప్రజలే బుద్ధిచెబుతారని జిల్లా వైకాపా నాయకులు పొట్టిమూర్తి పేర్కొన్నారు. గురువారం జీవీయంసీ 47వ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు నియామకం ద్వారా వారంతా విధులలో చేరుతున్నందున వారితో ప్రజలందరూ కలిసి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను తెలుసుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జనరంజక పాలనను అందిస్తున్న వైకాపా ప్రభుత్వం పై ప్రతిపక్షాలు బురద జల్లడం మానుకోవాలని కోరారు. ఇసుక సమస్యను తీర్చుతూ ప్రతి జిల్లా కేంద్రాలలో స్టాక్ యార్డులలో ఇసుకను అందుబాటులోనికి తెచ్చేవిధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలు జారీ చేసారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఓ మహాదేవి, కె.వి.మాస్టర్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## భీమిలిలో జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు ప్రారంభం



భీమునిపట్నం: స్థానిక గ్రంధాలయం లో 52 వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలను భీమిలి ఎం ఇ ఓ కె ఎ బాలమణి జెండాను ఆవిష్కరించి మాజీ ప్రదాని పండిట్ జవహర్ లాల్ నెహ్రు చిత్ర పటానికి పూలమాలల వేసి ప్రారంభించారు. అనంతరం పిల్లలకు వివధ పోటీలు నిర్వహించారు. భీమిలి గ్రంధాలయాదికారి వి వి జి ఎస్ శంకర్ రావు మాట్లాడుతూ ఈ రోజు నుంచి 20 వ తారికు వరకు జరిగే కార్యక్రమాలు వివరించారు చెప్పారు .15 న వ్యాసరచన పోటీలు ,16 న స్టొరీ రైటింగ్ ,17 న కథలు చెప్పడం , 18 న ధారావత్తులు చేర్పించడం ,19 న ఉమెన్స్ డే సెలబ్రేషన్స్ ,20 న పోటీలలో గెలుపొందిన వారికీ బహుమతులు అందజేయడం వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరుగు తుందని ఆయన తెలిపారు .ఈ కార్యక్రమంలో ఎసిపి పార్టీ ప్రతినిధి శ్రీనివాస్ విద్యార్డులు పాలుగున్నారు.

## బాలల దినోత్సవం సందర్భంగా 37వవార్డులో అమ్మఒడి కార్యక్రమం



విశాఖపట్నం : బాలల దినోత్సవం సందర్భంగా గురువారం 37వవార్డులోని వైయస్సార్ పార్టీ దళిత సీనియర్ నాయకులు అమ్మ ఒడి కార్యక్రమం ప్రారంభించారు. అలాగే గురువారం వైయస్ జగన్మోహన్ రెడ్డి తలపెట్టిన ఈ కార్యక్రమం మహిళల ద్వారా ఈ కార్యక్రమాన్ని అంగన్వాడి కేంద్రం లోని మొదలుపెట్టారు. మహిళలు అందరూ కూడా జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అమూల్య స్కూల్లోని 200 మంది పిల్లలందరికీ పలకులు, పుస్తకాలు, పెన్సిల్స్ పంచడం జరిగింది. 37వవార్డులోని వైయస్సార్ పార్టీ సీనియర్ నాయకులు దొండపర్తి లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిధులు వైఎస్ఆర్ పార్టీ సీనియర్ నాయకుడు మన పర్తి వెంకటరమణ , భాను ప్రకాష్, గోవింద్ రెడ్డి, వనపర్తి విజయకుమార్, గోపి, పెద్దన, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

# ఏ విధమైన సమాచారం ఇవ్వకుండా ఇళ్ళను కూల్చడం సమంజసంకాదు

## వి.సి.కె పార్టీ జిల్లా అధ్యక్షులు



అమలాపురం,: బుధవారం ఉదయం స్దానిక కుమ్మరి కాలువగట్టున అనుకోని పున్న పేదల ఇళ్ళను అధికారులు,పోలీసుల బందోబస్తితో ముందస్తు సమాచరం ఇవ్వకుండా కూల్చివేయడం సమంజసం కాదని వి.సి.కె పార్టీ జిల్లా అధ్యక్షులు బొంతు రమణ అన్నారు.పేదప్రజలకు ఇళ్ళ పట్టాలు కాని నివాసప్రాంతాను ఏర్పాటు చేయకుండా కనీసం ఇళ్ళలో ఉన్న సమానుకూడ తీసుకోను సమయం ఇవ్వకుండా ఇళ్ను కూల్చివేయటాన్ని వి.సి.కె పార్టీ అడ్డుకుంది.పేదప్రజలకు నివాసం ఉండటానికి ఇళ్లను లేక పట్టాలను ఏర్పాటు చేయాలని ఆర్.డి.ఒను వి.సి.కె పార్టి కోరింది.దినితో ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్న వారికి పునరావాసం కల్పిస్తామని ఆర్.డి.ఓ భవాణిశంకర్ హామిఇచ్చారని తెలిపారు.వి.సి.కె జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ఇళ్ళను కూల్చినవారికి నష్ఠపరిహారం,పునరావాసం కల్పించాలని లేనిఎడల పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపడతామని తెలపడంజరిగింది.

# విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన ప్రారంభం

**ప్రజలు సాహిత్యాన్ని బాగా చదవాలి ,విజ్ఞాన వంతులు కావాలి**

**జాయింట్ కలెక్టర్ 2 జి రాజకుమారి పిలుపు**

కాకినాడ: 35 వ జాతీయ పుస్తక వారోత్సవాలు సందర్భంగా విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన ను జాయింట్ కలెక్టర్ 2 జి .రాజ్ కుమారి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు .గురువారం ఉదయం స్థానిక మెయిన్ రోడ్ లో జిల్లా గ్రంధాలయం ఆనుకొని విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు .ఆమె మాట్లాడుతూ ప్రజలు అన్ని రకాల సాహిత్యాన్ని చదవాలని దాని ద్వారా విద్యావంతులు అవుతారని ఇది ఇప్పుడు మేలు చేస్తుందని ఆమె తెలియజేశారు .ఎంత మంది చదువు అలవాటు చేసుకుంటారో అంత సమాజానికి మంచి ఉపయోగ పడుతుందని ఆమె పేర్కొన్నారు .ఈ మంచి అలవాటును అందరు నేర్చుకోవాలని తద్వారా ప్రతి ప్రయత్నం విజయవంతం అవుతుందని ఆమె తెలియజేశారు .బుక్ హౌస్ మేనేజర్ మాట్లాడుతూ కాకినాడ పుస్తక మహోత్సవంలో శ్రీ రామకృష్ణ మఠం ,గీతా ప్రెస్ ,గోరఖ్పూర్ ,పరాగన్,పబ్లికేషన్స్ ,విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు టెస్ట్ , మంజుల పబ్లిషింగ్ హౌస్ ,రేంబో బుక్స్ ,బాల సాహిత్యం నుండి భారతం వెలది వరకు ఉంటాయని ఆయన అన్నారు ప్రతి పుస్తకానికి డిస్కౌంట్ కూడా ఉంటాయని ప్రత్యేక తగ్గింపు కూడా ఉంటుందని తెలియజేశారు. ప్రతి రోజు ఉదయం 9 గంటలనుండి రాత్రి 9గంటలవరకు ఉఅంటుందని విద్యార్థులు యువకులు మేధావి వర్గాలు రావాలని ఆయన తెలియజేశారు .ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు తాటిపాక మధు ,గ్రంధాలయం కార్యదర్శి ఎం శేఖర్ బాబు ,ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ అసిఫ్ ప్రధాన కార్యదర్శి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు

# విద్యారంగంలో గొప్ప సంస్కరణలు




## దేశం మొత్తం ఏపీవైపు చూస్తోంది
## వైకాపా ఎమ్మెల్యే రోజా

తిరుపతి: జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిల్లలు ఇంగ్లీష్ మీడియంలో చదవచ్చు, కానీ బడుగు బలహీన వర్గాల పిల్లలు చదవకూడదని చెప్పటం దారుణమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే రోజా అన్నారు. నవంబర్ 14 బాలల దినోత్సవం సందర్భంగా వడమాలపేట జిల్లా పరిషత్ పాఠశాలలోని బాలల దినోత్సవ కార్యక్రమానికి గురువారం రోజా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యారంగంలో గొప్ప సంస్కరణలు తీసుకొస్తున్న వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఇందుకే దేశం మొత్తం ఏపీ వైపు చూస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం.. ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు కల్పిస్తోందని, ఈ రోజే నిజమైన బాలల దినోత్సవమని పేర్కొన్నారు. అలాగే ఓ ఆడియో టేప్‌లో చంద్రబాబు 'బ్రీఫ్‌డ్ మీ' అంటూ తెలుగును చంపేశారని రోజా ఎద్దేవా చేశారు.

సీఎం జగన్ అమలు చేస్తున్న నవరత్నాల తరహాలోనే ప్రభుత్వ పాఠశాలల్లో 9 రకాల వసతులు కల్పిస్తున్నారని ఎమ్మెల్యే వెల్లడించారు.

### భారత ఔన్నత్యాన్ని చాటిన మహానేత
# జవహర్ లాల్ నెహ్రూ




విశాఖ సిటీ : దివంగత మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నగర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి స్థానిక పార్టీ కార్యాలయంలో జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం జయంతి ఉత్సవాలను ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి మాట్లాడుతూ స్వతంత్ర సంగ్రామంలో ముఖ్య పాత్రను పోషించిన ప్రముఖులలో జవహర్ లాల్ నెహ్రూ ఒకరని, స్వతంత్రం సిద్ధి అనంతరం మొదటి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించి భారత దేశ ఔన్నత్యాన్ని చాటిచెప్పిన మహామనీషి అని ఆమె కొనియాడారు.

అనంతరం పార్టీ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. తరువాత పార్టీ ముఖ్య నాయకులతో కలిసి బీచ్ రోడ్‌లో ఉన్న జవహర్ లాల్ నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# పవన్ కల్యాణ్ మాటలు నమ్మొద్దు..



విశాఖపట్నం: నాడు-నేడు కార్యక్రమంపై కొంతమంది బురదచల్లే ప్రయత్నాలు చేస్తున్నారని పర్యాటక శాఖ మంత్రి అవంతి శ్రీనివాస్ మండిపడ్డారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి వైఎస్ జగన్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పవన్ నాయుడు, చంద్రబాబు పవన్ మాటలు.. తల్లితండ్రులను తప్పుదోవ పట్టించే విధంగా ఉన్నాయని, నమ్మొద్దన్నారు. పవన్ కల్యాణ్ తన సొంత అన్నయ్య చిరంజీవిని మరిచిపోయి, అద్దె అన్న చంద్రబాబును తెచ్చుకున్నారని ఎద్దేవా చేశారు. జనవరి 9 నుండి అమ్మ ఒడి కార్యక్రమం ప్రారంభమవుతుందని వెల్లడించారు. 2024 నాటికి ఏపీ అక్షరాస్యతలో ఏపీ నంబర్ వన్‌కు రావాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ లక్ష్యమన్నారు.

చంద్రబాబుకు పవన్‌కల్యాణ్ అద్దె మైకులా మారిపోయారని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ద్రోణం రాజు శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. చంద్రబాబు చేస్తున్న దొంగ దీక్షలను ప్రజలు నమ్మరన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖల్నిమార్చడానికే ఇంగ్లిష్ మీడియం

### బాలల దినోత్సవ వేడుకల్లో జిల్లా ఇన్చార్జ్ మంత్రి కురసాల కన్నబాబు
### విఎంఆర్డిఏ ఆధ్వర్యంలో ఘనంగా బాలల వేడుకలు




విశాఖపట్నం : ప్రభుత్వ పాఠశాలల రూపురేఖల్ని మార్చడానికే రాష్ట్ర ప్రభుత్వం ఇంగ్లిష్ మీడియం ను ప్రేవేశ పెట్టినట్లు జిల్లా ఇన్చార్జ్ మంత్రి కురసాల కన్నబాబు పేర్కొన్నారు. గురువారం విఎంఆర్డిఏ ఆధ్వర్యంలో బాలల ప్రాంగణం లో నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకలకు మంత్రి ముఖ్య అతిధిగా విచ్చేశారు. జ్యోతి ప్రకాశనం గావించి, పండిత్ జవాహరలాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలంకరణ గావించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల పిల్లలు ఉండాలనే విద్యాతో పాటు మౌలిక వసతులను కూడా మెరుగుపరుస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తు కోసం ఆలోచన చేయని వారు నాయకులే కాదని, పిల్లలంతా ఉన్నత స్థాయికి చేరాలనే ఆలోచన చేసి ఆంగ్ల మీడియం న్ను ప్రవేశపెడుతున్నామని అన్నారు. రెండేళ్ల తర్వాత పాఠశాలలో సమూల మార్పులు వస్తాయని అన్నారు. రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస రావు మాట్లాడుతూ పిల్లలు అబ్దుల్ కలామ్ను స్ఫూర్తి గా బాలలు కలలు కనాలని, వాటి సాకరానికి కృషి చేయాలని హితవు పలికారు. రాష్ట్ర ముఖ్యమంత్రి గారి అండదండలు పిల్లలకు ఎప్పుడు ఉంటాయని, తల్లిదండ్రులు పిల్లలకు తమకు ఇష్టమైన రంగం లో రాణించేలా చూడాలని అన్నారు. జిల్లా కలెక్టర్ వినయ్ చంద్ మాటాడుతూ నాడు- నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలో ఉత్తేజాన్ని నింపడం జరుగుతోందని అన్నారు.

ఈ కార్యక్రమానికి విఎంఆర్డిఏ చైర్మన్ ద్రోణామ్ రాజు శ్రీనివాస రావు సభాధ్యక్షత వహించారు. కార్యక్రమం లో పార్లమెంట్ సభ్యులు సత్యవతి, గొట్టేటి మాధవి, శాసన సభ్యులు తిప్పల నాగిరెడ్డి, కరణం ధర్మశ్రీ, గుడివాడ అమర్నాధ్, గొల్ల బాబూ రావు, విఎంఆర్డిఏ కమిషనర్ పి. కోటేశ్వర రావు, జీవీఎంసీ కమిషనర్ సృజన తదితరులు హాజరైనారు. ఈ సందర్భంగా నిర్వహించిన బాలల సాంస్కృతిక కార్యక్రమాలు రెక్షకులను ఆకట్టుకున్నాయి.

# ఉన్నత విద్యతోనే దేశ భవిత

- ప్రభుత్వ పాఠశాలలోని మౌలిక వసతుల కల్పనే ధ్యేయం
- మన ప్రభుత్వ పాఠశాలలు దేశానికే గర్వకారణం కావాలి
- అమ్మ ఒడి ద్వారా ప్రతీ ఒక్కరూ విద్యావంతులు కావాలి
- సీఎం జగన్ కలల స్వప్నం వీధి బాలల చదువు
- మన బడి, నాడు-నేడు కార్యక్రమంలో కేకే రాజు




సీతమ్మధార : విద్యార్థులు చిన్నతనం నుండి ఉత్తమ పౌరులుగా ఎదుగుతూ ఉన్నత విద్యను అభ్యసించిన నాడే రాష్ట్ర, దేశ భవిష్యత్తు మారుతుందని, దివంగత ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైకాపా విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు విద్యార్థులకు పిలుపునిచ్చారు. గురువారం బాలల దినోత్సవం సందర్భంగా పి అండ్ టి కాలనీలో ఎన్ఎంసి హైస్కూల్లో ఏర్పాటు చేసిన మన బడి, నాడు-నేడు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన కేకే రాజు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కలల స్వప్నమైన ఉన్నత విద్య ప్రతీ ఒక్కరికీ అందేలా కృషి చేయాలని ఆయన అన్నారు. 2019కి ముందు గత ప్రభుత్వంలో పాఠశాలల విద్య కొన్ని కార్పొరేట్ శక్తుల కబంధ హస్తాల్లో ఉండేదని, విద్య పేరుతో సామాన్యుల నుండి కోట్లాది రూపాయలు ఫీజుల రూపంలో వసూలు చేశారని, అలాంటి కార్పొరేట్ విద్యకు స్వస్తి పలికి ప్రభుత్వ పాఠశాలల్లోని అన్ని మౌలిక సదుపాయాలతో కార్పొరేట్‌లకు దీటుగా ఉచిత విద్యను అందించడమే ముఖ్య మంత్రి జగన్ మహన్‌రెడ్డి ధ్యేయమని అన్నారు. త్వరలో ప్రవేశపెట్టబోవు అమ్మ ఒడి పథకం ద్వారా ప్రతీ ఒక్కరూ మరింత విద్యావంతులు కావడం ఖాయమన్నారు. మన ప్రభుత్వ పాఠశాలలోని విద్యా విధానాన్ని చూసి దేశంలోని అన్ని రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకోవాలని, మన ప్రభుత్వ పాఠశాలలో దేశానికే గర్వకారణం కావాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన అన్ని హామీలు అమలు చేసేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీసీ వి. సన్యాసిరావు, జోనల్ కమిషనర్ శ్రీనివాస్, డివైఈఓ లక్ష్మీనారాయణ, ప్రధానోపాధ్యాయుడు రాంప్రసాద్, ఎస్ఎంసి చైర్మన్ జె. కృష్ణ, మాజీ కార్పొరేటర్లు కొల్లాబత్తుల వెంగళరావు, బాణాల శ్రీనివాసరావు, జి.వి. రమణి, పోతు సత్యనారాయణ, ఉత్తర నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నంబాళ్ల ఈశ్వరరావు, 11వ వార్డు అధ్యక్షుడు బి. ఎల్లాజీ, వైకాపా సీనియర్ నాయకుడు ఆదిరెడ్డి అప్పారావు, కె.వి. బాబా, కట్టమూరి సతీష్, యువనాయకుడు శాంతిస్వరూప్, మహిళా నాయకులు పద్మారెడ్డి, మధులత, కమల కుమారి, సుశీల, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# సిటీ ఆపరేషన్స్ సెంటర్ పనితీరు భేష్

- యు.ఎస్.అంబాసిడర్ టు ఇండియా
- కెన్నెత్ జస్టర్ ప్రశంసలు




విశాఖపట్నం : సిటీ ఆపరేషన్స్ సెంటర్ పనితీరుపై యు.ఎస్. అంబాసిడర్ టు ఇండియా కెన్నెత్ జస్టర్ (Kenneth Juster) ప్రశంసించారు. గురువారం సిటీ ఆపరేషన్ సెంటర్‌ను సందర్శించి పనితీరును ప్రశంసించారు. ఈసందర్భంగా కమిషనర్ డా॥ జె.సృజన సిఓసి బృందం మరియు ఐకాం ప్రతినిధులను యు.ఎస్. బృందం అభినందించింది. స్మార్ట్ సిటీ పనితీరును మెచ్చుకున్నారు. అనంతరం స్మార్ట్ పోల్స్ పనితీరును పరిశీలించారు. తదుపరిచిన వాల్తేరు మున్సిపల్ పాఠశాల విద్యార్థులతో సిటీ ఆపరేషన్స్ సెంటర్ నుండి మాట్లాడారు. డిజిటల్ తరగతుల నిర్వహణపై అభినందనలు తెలిపారు.



గ్రీవెన్స్ పరిష్కా రం, టాక్స్‌కు సంబంధిం చిన పోర్టల్స్ నిర్వహణను అభినం దించారు. కార్యక్రమంలో కమిష నర్ డా॥ జె.సృజన, సిఇ వెంకటేశ్వర రావు, ఎస్ఇ వినయ్ కుమార్, స్మార్ట్ సిటీ మేనేజర్ ఆనంద్, ఐకాం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వైకాపాలోకి కొనసాగుతున్న వలసల పర్వం

## టీడీపీకి గుడ్‌బై.. వైకాపాలో చేరిన దేవినేని అవినాష్

తాడేపల్లి: ఇసుక కొరత అంటూ దీక్షకు దిగిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకు కృష్ణా జిల్లాలో భారీ షాక్ తగిలింది. ఇప్పటికే గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ టీడీపీకి గుడ్‌బై చెప్పిన విషయం తెలిసిందే. తాజాగా తెలుగు యువత అధ్యక్ష్య పదవికి, టీడీపీ సభ్యత్వానికి రాజీనామా చేసిన దేవినేని అవినాష్ గురువారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. సీఎం వైఎస్ జగన్ సమక్షంలో దేవినేని అవినాష్‌తో పాటు టీడీపీ సీనియర్ నాయకుడు కడియాల బుచ్చిబాబు వైఎస్సార్ సీపీలో చేరారు.

వారిద్దరికీ ముఖ్యమంత్రి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం దేవినేని అవినాష్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి సీఎం జగన్ ఎంతో కృషి చేస్తున్నారు. నవరత్నాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. ముఖ్యమంత్రి జగన్ చేపట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నచ్చే పార్టీలో చేరా. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగు జాడల్లోనే నడుస్తా. టీడీపీలో మా వర్గం నాయకులు, కార్యకర్తలకు అన్యాయం జరిగింది. ఎన్నిసార్లు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు అని అన్నారు. కాగా దేవినేని అవినాష్ ఇవాళ తెలుగుదేశం పార్టీతో పాటు తెలుగు యువత అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు.

ఆయన తన రాజీనామా లేఖను టీడీపీ రాష్ట్ర కార్యాలయానికి పంపించారు. గత రెండు నెలలుగా మీడియాతో పాటు సోషల్ మీడియాలో పలు సందర్భాల్లో నేను టీడీపీని వీడుతున్నాను అంటూ పలు వదంతులు వచ్చాయి. అవి వచ్చాయి అనడం కంటే సృష్టించబడ్డాయి అంటే సబబుగా ఉంటుంది. మరో పక్క ఈ రెండు నెలలు నేను పార్టీ నాకు అప్పగించిన బాధ్యతలు తూచా తప్పకుండా నిర్వహిస్తూనే ఉన్నాను. ఆ వదంతుల వెనుక ఎవరు ఉన్నారు అనేది పార్టీ అధిష్టానానికి పలుసార్లు విన్నవించడం కూడా జరిగింది.



ఈ రోజు వరకూ మా సొంత ప్రయోజనాల గురించి ఏరోజూ ఆలోచించకుండా పార్టీ ఎక్కడికి వెళ్లి పోటీ చేయమంటే అక్కడికి వెళ్లి పోటీ చేసి పార్టీ ఆదేశాలే శిరోధార్యంగా నడుచుకున్న విషయం మీకు తెలియంది కాదు. ఇదంతా పక్కన పెడితే మేము మొదటి నుంచి అడిగింది కానీ ఈ రోజు అడుగుతుంది కానీ జిల్లాలో పలు నియోజకవర్గాల్లో ఉన్న మా సొంత క్యాడర్‌కి ఏ రోజున అక్కడి స్థానిక నాయకత్వం సముచిత స్థానం కల్పించకపోగా పలు ఇబ్బందులకి గురి చేశారు. ఈ విషయంపై పలుసార్లు మీకు ఇప్పటికే విన్నవించాను.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ★ Phone : 2564353, Fax : 0891-2569004 ★ e-mail: vijayabhanudaily@gmail.com